www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 30 ఏప్రిల్ 2025

5

వైఎస్ఆర్



రేపటి నుంచి యోగా కొత్త బ్యాచ్ ప్రారంభం

ప్రజాశక్తి - కడప అర్బన్ : పటేల్ రోడ్డులో ఉన్న మిత్ర యోగా సెంటర్‌లో 30 రోజుల పాటు నిర్వహించబడే యోగా శిక్షణ కొత్త బ్యాచ్‌ను మే 1 నుంచి ప్రారంభిస్తున్నట్లు యోగా నిపుణులు డాక్టర్ కల్పన, డాక్టర్ రంగనాథ రెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఈ శిక్షణలో రోగనిరోధక శక్తిని పెంపొందించుకోవడానికి, మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడానికి, అధిక బిపి, డయాబెటిస్, ఒబేసిటీ వంటి దీర్ఘకాలిక సమస్యల నివారణకు, ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని పెంపొందించుకోవడానికి అవసరమైన యోగాసనాలు, ప్రాణాయామం, సూర్యనమస్కారాలు, షట్ క్రియలు, ధ్యానం వంటి యోగ ప్రక్రియలను శాస్త్రీయంగా సాధన చేయిస్తామని తెలిపారు. ఈ శిక్షణ ఉదయం 5.45 గంటల నుంచి 7.00 గంటల వరకు మొదటి బ్యాచ్, 8.30 గంటల నుంచి 10 గంటల వరకు మహిళలకు రెండో బ్యాచ్ ఉంటుందని పేర్కొన్నారు. వివరములకు 9848861206, 7013238986 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

ఉద్యాన సాగుతో రైతుకు ఆర్థిక పరిపుష్టి

హార్టికల్చర్ హబ్‌గా జిల్లాను తీర్చిదిద్దుతాం
ఉద్యాన సమ్మేళనంలో కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

ప్రజాశక్తి - కడప అర్బన్



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

ఉద్యాన పంటల సాగుతో రైతులకు తక్కువ ఖర్చుతో, అధిక లాభాలతో పాటు ఆర్థిక పరిపుష్టి చేకూరుతుందని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. జిల్లా రైతులను ఉద్యాన సాగులో ప్రోత్సాహం కల్పించే దిశగా మంగళవారం ఊటుకూరులోని మాధవి కన్వెన్షన్ హాల్‌లో జిల్లా ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ అధ్యక్షతన 'కడప ఉద్యాన సమ్మేళనం' నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా జిడిపిలో 45 శాతం వాటా ఒక్క ఉద్యాన ఉత్పత్తుల ద్వారా వస్తోందని, జివిఎడిపిలో జిల్లా వాటా శాతాన్ని పెంపొందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో రాబోయే 5 సంవత్సరాల్లో 15శాతం అభివృద్ధి చేయిస్తున్నారు. జిల్లాలో ప్రధానంగా అరటి, చీనీ, పసుపు, ఉల్లిగడ్డ మొదలైన ప్రధాన పంటలను జిల్లా ఉద్యాన (గ్రోత్ ఇంజన్స్)గా గుర్తించామన్నారు. ఈ ప్రధాన పంటలను రాష్ట్ర, దేశస్థాయిలో కాకుండా ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందేలా ప్రయత్నం చేస్తున్నామన్నారు. కడప జిల్లా హార్టికల్చర్ హబ్ గా అభివృద్ధి చెందు తోందన్నారు. రాష్ట్ర హార్టికల్చర్ అండ్ సెరికల్చర్ డైరెక్టర్ డాక్టర్ కె. శ్రీనివాసులు మాట్లాడుతూ రైతు సోదరులు కూడా (గ్రోత్ వాల్యూ ఎడిషన్ (జీవీఏ) గురించి తెలుసుకోవాలన్నారు. జిల్లా ఉద్యాన శాఖాధికారి సుభాషిణి మాట్లాడుతూ ఇక్కడ ఉద్యాన పంటల సాగుకు విపరీతమైన అవకాశం, అనుకూలతలను దృష్టిలో ఉంచుకుని జిల్లాను హార్టికల్చర్ హబ్ గా అభివృద్ధి చేస్తామన్నారు. జిల్లాలో పండిస్తున్న అరటి, మామిడి, చీనీ తదితర పంటలు విదేశాలకు ఎగుమతి అవుతున్నాయన్నారు. జిల్లాలో 64,288 హెక్టార్ల విస్తీర్ణంలో ఉద్యాన పంటలు సాగు అవుతున్నాయన్నారు. 14,91,154 లక్షల మెట్రిక్ టన్నుల ఉద్యాన ఉత్పాదక ఉన్నాయన్నారు. అందులో పండ్ల తోటలు 42,699 హెక్టార్లలో 11,71,865 మెట్రిక్ టన్నులు, కూరగాయలు 12,165 హెక్టార్లలో 2,84,853 మెట్రిక్ టన్నులు, సుగంధ ద్రవ్యాలు 7,532 హెక్టార్లలో 18,552 మెట్రిక్ టన్నులు, పువ్వులు 1,890 హెక్టార్లలో 15,884 మెట్రిక్ టన్నుల ఉత్పత్తిని చేయడం జరుగుతోందన్నారు. కాగా ఉద్యాన పంటల సాగులో రాష్ట్రంలోనే జిల్లా మొదటి స్థానంలో ఉందన్నారు. అనంతరం కడప, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు ఎమ్మెల్యేలు మాట్లాడారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు

త్వరలో ఉచిత బస్సు సౌకర్యం
నెల రోజుల్లో సిటీ బస్సులు ప్రారంభిస్తాం
ఆర్‌టిసి జోనల్ చైర్మన్ పూల నాగరాజు



బస్టాండ్ సేవలను అడిగి తెలుసుకుంటున్న చైర్మన్ పూల నాగరాజు

ప్రజాశక్తి - కడప అర్బన్

ఏపీ రోడ్డు రవాణా సంస్థ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, త్వరలో ఉచిత బస్సు సౌకర్యం ప్రారంభమవుతుందని ఆర్‌టిసి జోనల్ చైర్మన్ పూల నాగరాజు పేర్కొన్నారు. మంగళవారం కడప ఆర్‌టిసి బస్టాండ్‌కు చేరుకున్న ఆయనకు డి.ఎం డి.శ్రీశ్వరరావు స్వాగతం పలికారు. బస్టాండ్ ఆవరణలో మొక్క నాటారు. బస్టాండ్, ఆ గ్యారేజీ, కార్గో సేవలు, ప్రయాణికులకు మంచినీటి సౌకర్యం ఉందా లేదా, నూతన బస్టాండులో జరుగుతున్న సిమెంట్ రోడ్డు పనులను పరిశీలించారు. ప్రయాణికులకు అందుతున్న సేవలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉద్యోగులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌టిసి బస్టాండులలో పరిస్థితులు ఎలా ఉన్నాయో అధ్యయనం చేస్తున్నామని పేర్కొన్నారు. నివేదికను తయారుచేసి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళతామన్నారు. ఎక్కడ ఏమి అవసరమో వాటిని సమకూర్చి మెరుగైన సౌకర్యాలను అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు త్వరలో ఉచిత బస్సు సౌకర్యాన్ని ప్రారంభిస్తామని చెప్పారు. ఆర్‌టిసి ఆసుపత్రి సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ఆర్‌ఎం, ఇడి, డి ఓ బాగా పనిచేస్తున్నారని కితాబిచ్చారు. మరిన్ని విద్యుత్ బస్సులు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. మొత్తం బస్ స్టేషన్లు, జోన్-1, జోన్ -2 డిపోలు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తుందన్నారు. నెల రోజుల్లో నగరంలో సిటీ బస్సులను అందుబాటులోనికి తీసుకురావాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. ఆర్‌ఎం గోపాల్ రెడ్డి మాట్లాడుతూ మెరుగైన రవాణా సౌకర్యాన్ని ప్రజలకు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఇయు నాయకులు చైర్మన్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఇడి చంద్రశేఖర్, అసిస్టెంట్ మేనేజర్ కన్యాకుమారి, సూపరింటెండెంట్ మంజుల, ఇయు అధ్యక్షులు కుమార్, కార్యదర్శి రాజశేఖర్, ఆర్‌టిసి ఉద్యోగులు పాల్గొన్నారు.

గ్రామీణ బ్యాంకుల్లో అగ్రగామి ఎపిజిబి

- చైర్మన్ సత్య ప్రకాష్ సింగ్

ప్రజాశక్తి - కడప అర్బన్



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ సత్య ప్రకాష్ సింగ్

ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ రూ.23,667 కోట్ల డిపాజిట్లు, రూ. 27,090 కోట్ల రుణాలతో మొత్తం రూ.50,757 కోట్ల వ్యాపారంతో దేశం లోని గ్రామీణ బ్యాంకులలో అగ్రగామిగా ఉందని బ్యాంకు చైర్మన్ సత్య ప్రకాష్ సింగ్ పేర్కొన్నారు. మంగళవారం మరియాపురం రోడ్డులో ఉన్న బ్యాంకు కార్పొరేట్ హాల్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎపిజిబి 2024-25 ఏడాదికి రూ.639 కోట్ల నికర ఆదాయం ఆర్జించిందని తెలిపారు. అతి తక్కువ మొండి బకాయిలున్నాయని చెప్పారు.రాష్ట్రంలోని 10 జిల్లాల పరిధిలోని 56 లక్షల ఖాతాదారులకు అన్ని రకాల బ్యాంకింగ్ సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. 6,90,538 రైతులకు రూ.8,798 కోట్ల పంట రుణాలు, 1,20,653 మహిళా సంఘాల గ్రూపులకు రూ.6,867 కోట్ల రుణాలు మంజూరు చేశామన్నారు. అన్ని రకాల ఆధునిక సాంకేతిక సదుపాయాలను బ్యాంకు అందిస్తుందని తెలిపారు. ప్రగతి విద్యా జ్యోతి పథకం ద్వారా ఎస్‌సి, ఎస్‌టి బాలికలకు ఒక్కొక్కరికి రూ.5 వేలు చొప్పున 482 మందికి స్కాలర్షిప్స్ అందజేశామని చెప్పారు. మే ఒకటి నుంచి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు మరింత మెరుగైన సేవలు రాష్ట్రమంతటా అందిస్తుందని తెలిపారు. సమావేశంలో జనరల్ మేనేజర్లు హరికేశ్వర ప్రసాద్, పడిగేటివార్, సంజీవప్ప, రాజేంద్రన్, చీఫ్ మేనేజర్లు, ప్రధాన కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సర్టిఫికెట్లు ఎంఇఒల ద్వారా పంపిణీ చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - కడప అర్బన్



డిఇఒకు వినతి పత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రిఫరెన్సియల్ కేటగిరీకి సంబంధించిన సర్టిఫికెట్లను మండల విద్యాశాఖ అధికారుల ద్వారా ఉపాధ్యాయులకు పంపిణీ చేయాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు కోరారు. జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో డిఇఒ షంషుద్దీన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ త్వరలో జరగబోవు ఉపాధ్యాయ బదిలీలలో ఉపాధ్యాయులకు సంబంధించిన ప్రిఫరెన్సీల్ కేటగిరి ఉపయోగించుకోవడానికి ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకు కడప రిమ్స్‌లో మెడికల్ టెస్ట్‌లు నిర్వహించారని చెప్పారు. ఆ మెడికల్ టెస్ట్ లకు సంబంధించిన సర్టిఫికెట్లను 29న కడప జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో పంపిణీ చేస్తామని తెలిపారన్నారు. అయితే ప్రిఫరెన్సియల్ కేటగిరీకి సంబంధించిన అనేకమంది ఉపాధ్యాయులు సుదూర ప్రాంతం నుంచి జిల్లా కేంద్రానికి రావడానికి అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందని, అలాగే వేసవి తీవ్రత అధికంగా ఉన్న దృష్ట్యా మెడికల్ సర్టిఫికెట్లను ఆయా మండలాలకు సంబంధించిన ఎంఇఒల ద్వారా పంపిణీ చేయాలని కోరారు. స్పందించిన డిఇఒ ప్రస్తుతానికి కొంతమంది సంబంధించిన సర్టిఫికెట్లు మాత్రమే వచ్చాయని మిగిలిన సర్టిఫికెట్లు త్వరలో వస్తాయని తెలిపారు. అ యుటిఎఫ్ కడప జిల్లా శాఖ అభ్యర్థన మేరకు అన్నమయ్య జిల్లాకు సంబంధించిన సర్టిఫికెట్లు రాయచోటికి పంపుతామని, మిగిలిన సర్టిఫికెట్లు ఎంఇఒలతో మాట్లాడి పంపిణీ చేయడానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కృష్ణారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు బత్తుల చంద్రశేఖర్, గాజులపల్లి గోపినాథ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తే కఠిన చర్యలు : ఆర్‌డిఒ

ప్రజాశక్తి-కాశినాయన



మాట్లాడుతున్న ఆర్‌డిఒ చంద్రమోహన్

మండలంలో ప్రభుత్వ భూమిని ఎవరైనా కబ్జా చేసి వారి ఇష్టం వచ్చినట్లు స్వాధీన పరచు కుంటే ఎంతటి వారి పైన చట్టపైన చర్యలు ఉంటా యని బద్వేల్ ఆర్‌డిఒ చంద్ర మోహన్ పేర్కొన్నారు మంగళవారం ఆయన తహాశీల్దార్ కార్యాలయంలోని సిబందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నాయన పల్లె రెవెన్యూ పొలంలో 217.129.130 సర్వే నెంబర్లలో కొండ పోరంబోకు భూమి ఉందని, దాదాపు 800 ఎకరాలు ఇటీవల భూ కబ్జాదారులు వారి ఇష్టం వచ్చినట్లు దౌర్జన్యంగా స్వాధీనం చేసుకుని పంటలు పెట్టారని, ఈ విషయంపై తానే స్వయంగా వచ్చి విచారణ చేశామని చెప్పారు. ఇందులో చాలా వరకు వాస్తవాలున్నాయని, దాదాపు 294 ఎకరాలు కబ్జా అయినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. భూమిని స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. కొందరైతే జలకళ కింద కొన్ని బోర్లు అక్రమంగా అన్యాయంగా వేశారని, కరెంటు కూడా సర్వే నెంబర్లు వేరే చోట చూపించి ఇక్కడ బోర్లు కరెంట్ లాగారని చెప్పారు. వరికుంట గ్రామానికి చెందిన కాకా కాశినారాయణ అనే రైతు 65/1 సర్వేనెంబర్ చూపించి జలకళ బోరు కొండ పోరంబోకులో వేశారని అది ఎలా వేశారని పూర్తిస్థాయి నివేదికను సేకరిస్తున్నామన్నారు ఈ విషయంపై పూర్తి నివేదిక తెప్పించుకొని పూర్తి సమాచారం కలెక్టర్‌కు నివేదిస్తామని చెప్పారు.

డిసిఒను సస్పెండ్ చేయాలి

- విద్యార్థి, యువజన సంఘాల డిమాండ్

ప్రజాశక్తి - కడప అర్బన్ : కొండాపురం గురుకుల పాఠశాల ప్రిన్సిపల్‌కు వత్తాసు పలుకుతున్న డిఒఒను సస్పెండ్ చేయాలని, అధికారులు చర్యలు తీసుకోవడంలో ఎందుకు తాస్కారం చేస్తున్నారని విద్యార్థి, యువజన ప్రజా సంఘాల నాయకులు ప్రశ్నించారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం డిఆర్‌ఒ విశ్వేశ్వర నాయుడు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల.శివకుమార్, ఎఐఎస్‌బి జిల్లా కన్వీనర్ రాజేంద్ర, పిఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాగరాజు, ఆంధ్రప్రదేశ్ దళిత మిత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షులు కైపు రామాంజనేయులు, ఎపిపిఎ కన్వీనర్ భాస్కర్ మాట్లాడుతూ కొండాపురం గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ ఆమె భర్త పై అనేక ఆరోపణలు వస్తున్నాయని చెప్పారు. పైగా ఇద్దరిపైన కేసు నమోదు కూడా అయ్యిందని తెలిపారు. ఆరోపణలు, కేసులు కలిగిన వ్యక్తిని అక్కడే ప్రిన్సిపల్‌గా కొనసాగించడంలో ఆంతర్యమేమిటి అని ప్రశ్నించారు. ఆరోపణలు, కేసులు నమోదైన వారు అక్కడే ప్రిన్సిపల్‌గా ఉంటే విద్యార్థులలో అభద్రతాభావం కలుగుతుందని అన్నారు. విద్యార్థినులు కలిగిన పాఠశాలల్లో ప్రిన్సిపల్ భర్త క్వార్టర్స్‌లో ఉన్నారనే బహిరంగంగా విమర్శలు, ఆరోపణలు వినిపిస్తున్నాయి, ఇటువంటి వ్యక్తిని డిసిఒఆ పాఠశాల నుంచి బదిలీ కూడా చేయకుండా, వారికి వత్తాసు పలుకుతున్నారని పేర్కొన్నారు. తక్షణమే అధికారులు కొండాపురం గురుకుల పాఠశాల ప్రిన్సిపల్‌ను భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యాశాఖ మంత్రి లోకేష్, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవితమ్మకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. అవసరమైతే కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం కూడా చేస్తామని చెప్పారు.

పదవికి వన్నె తెచ్చేలా విధులు

ప్రజాశక్తి - బద్వేలు : పదవికి వన్నె తెచ్చేలా విధులు నిర్వహిస్తానని ఇటీవల నూతనంగా నియమితులైన డిసిసిబి చైర్మన్ సూర్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన టిడిపి నాయకులు, కార్యకర్తలతో కలిసి నాలుగురోడ్ల కూడలిలోని మాజీ మంత్రి బిజివేముల వీరారెడ్డి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, ఎన్‌టిఆర్ కాంస్య విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు బాణా సంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. బద్వేల్, గోపవరం అట్లూరు పలు మండలాల టిడిపి నాయకులు కార్యకర్తలు భారీ స్థాయిలో పాల్గొని సూర్యనారాయణరెడ్డిని శాలువాలతో సత్కరించి ప్రత్యేక అభినందనలు తెలిపారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, బద్వేల్ నియోజకవర్గ టిడిపి సమన్వయకర్త రితిష్ రెడ్డిని ఆయన మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తనను డిసిసి బ్యాంకు చైర్మన్‌గా నియమించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలియజేశారు. సమిష్టి కృషితో పదవికి వన్నె తెచ్చేలా నడుచుకుంటావని తెలిపారు

క్రికెట్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్‌పై ప్రత్యేక నిఘా

సామాన్యుడికి తక్షణమే న్యాయం - నేర సమీక్ష సమావేశంలో ఎస్‌పి ఇ.జి.అశోక్ కుమార్

ప్రజాశక్తి - కడప అర్బన్



పోలీస్ స్టేషన్‌కు వచ్చే సామాన్యుల ఫిర్యాదులకు తక్షణం స్పందించి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎస్‌పి ఇ.జి. అశోక్ కుమార్ పోలీస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలైన క్రికెట్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్, మట్కా జిల్లాలో ఎక్కడా జరగకుండా కఠినంగా వ్యవహరించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. వేసవి నేపథ్యంలో పర్యాటకులు సందర్శించే నదులు, చెరువులు, వంకలు, ఇతర నీరు నిల్వ ఉండే కుంటల వద్ద సరదాగా నీటిలో దిగి ప్రమాదాల బారిన పడకుండా ఆయా ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులతో పాటు గస్తీని పెంచాలని ఆదేశించారు. జిల్లాలో రాత్రి 10:30 లోగా షాపులు మూసివేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కడప నగరం రింగ్ రోడ్, ఊటుకూరు సర్కిల్, సాక్షి సర్కిల్, ఇతర శివారు ప్రాంతాలు, ప్రొద్దుటూరు పట్టణ శివారు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎలాంటి నేరాలకు తావు లేకుండా నిరంతరం విజిబుల్ పోలీసింగ్ చేయాలన్నారు. ఆకతాయిలు, బహిరంగ మద్యపానంపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్‌పి ఆదేశించారు. జిల్లాను గంజాయి, ఇతర నిషేధిత మత్తు పదార్థాల రహితంగా చేసేందుకు సమష్టిగా కృషి చేయాలన్నారు. గంజాయి సేవించే అవకాశం ఉన్న శివారు ప్రాంతాలు, ఇతర ప్రదేశాల్లో డ్రోన్ కెమెరాల ద్వారా నిఘా పెంచాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహనా కార్యక్ర మాలు నిర్వహించాలన్నారు డాబాలు, హోటళ్ళు, లాడ్జిలు, బస్ స్టాండ్లు, రైల్వే స్టేషన్‌లలో తనిఖీలు నిర్వహించాలన్నారు. పగలు, రాత్రి గస్తీ ని పెంచాలని ఆదేశించారు సమావేశంలో జిల్లాలోని డిఎస్‌పిలు, సిఐలు పాల్గొన్నారు. విధుల్లో ప్రతిభ కనబరచిన పోలీస్ అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు.

నీట్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు : కలెక్టర్

ప్రజాశక్తి - కడప : జిల్లాలో మే 4న నీట్ యూజీ– 2025 పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులకు సూచించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని బోర్డు రూమ్ హాలు లో నీట్ పరీక్షలకు సంబంధించిన ఏర్పాట్లపై నీట్ యూజీ అధికారులు, విద్యా శాఖా అధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎస్‌పి అశోక్ కుమార్, జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం ఎనిమిది ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో ప్రొద్దుటూరులో రెండు పరీక్ష కేంద్రాలు, కడప జిల్లా కేంద్రంలో ఆరు పరీక్ష కేంద్రాలు ఉన్నాయని తెలిపారు.ఈ పరీక్షల్లో మొత్తం 2428 మంది విద్యార్థులు హాజరవుతారని ఆయన తెలిపారు. పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు ఆఫ్ లైన్లో విధానంలో జరుగుతుందని చెప్పారు. ఉదయం 11 గంటల నుంచి విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ విధించి కట్టుదిట్ట భద్రత ఏర్పాటు చేయాలని పోలీసు శాఖ వారిని ఆదేశించారు. కస్టోడియన్ బ్యాంకుకు వచ్చిన పరీక్ష పేపర్లను సూపరింటెండెంట్లు, పోలీసు సహకారంతో తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. ఇభిన్న ప్రతిభావంతుల విద్యార్థులకు పరీక్ష కేంద్రంలో వీల్ చైర్లను, సహాయకులను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అభ్యర్థులు సెల్ ఫోన్, లు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతి లేవని తెలిపారు. ప్రొద్దుటూరులో అనిబిసెంట్, వైఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల, కడప నగరంలో ఎస్‌కె ఆర్ అండ్ ఎస్‌కె ఆర్ డిగ్రీ కళాశాల, కడప ప్రభుత్వం జూనియర్ కళాశాల, కడప మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్,ఎంసిహెచ్ఎస్ మెయిన్స్, కేంద్రీయ విద్యాలయం, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులం, వైఆర్ జడ్‌పి హెచ్ పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో డిఆర్‌ఒ విశ్వేశ్వర నాయుడు, డిఇఒ షంషుద్దీ, అధ్యాపకులు, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'సోలార్ రూఫ్ టాప్'పై అవగాహన కల్పించాలి

- జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్.రమణ

ప్రజాశక్తి - కడప



మాట్లాడుతున్న విద్యుత్ ఎస్ఇ ఎస్. రమణ

సోలార్ రూఫ్ టాప్ వల్ల విద్యుత్ బిల్లులు గణనీయంగా తగ్గించుకోవచ్చని, ప్రజలలో అవగాహన కల్పించాలని జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్. రమణ తెలియ జేశారు .ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం ద్వారా కడప జిల్లాలో లక్ష వినియోగదారులకు సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకునేల్ పనులు వేగవంతం చేయాలని సూచించారు. లక్ష గృహాలకి సోలార్ రూఫ్ టాప్ లక్ష్యంలో భాగంగా మంగళవారం విద్యుత్ ఎస్ఇ ఎస్. రమణ విద్యుత్‌భవన్‌లోని తన ఛాంబర్‌లో సంస్థాపన వెండర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుకు సబ్సిడీ పోను పెట్టిన పెట్టుబడి వ్యయం తక్కువ సమయంలో తిరిగి వస్తుందని తెలియజేశారు.రానున్న కాలంలో విద్యుత్ వాహకాల ప్రాధాన్యత అధికంగా ఉంటుంది, కావున వీటికి అవసరమైన విద్యుత్ శక్తి సోలార్ రూఫ్ టాప్ ద్వారా పొందవచ్చని తెలియజేశారు. ప్రజలు ఏర్పాటు చేసుకునే సూర్య పలకల వల్ల పునరుత్పాదక శక్తి అయిన సౌరశక్తి ద్వారా విద్యుత్తు ఉత్పత్తి పెరుగుతుందని, తద్వారా థర్మల్ విద్యుత్ వాడకం తగ్గి వాతావరణ కాలుష్యానికి కారకమైన కర్బన ఉద్గారాలను అరికట్టవచ్చని చెప్పారు. .సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకోవడం వల్ల వచ్చే లబ్ధిపై ప్రజలలో విస్తృతంగా అవగాహన కల్పిస్తూ లక్ష ఇళ్ల సోలార్ రూఫ్ టాప్ లక్ష్యాన్ని అధిగమించాలని ఆదేశించారు. సమావేశంలో నెడ్ క్యాప్ డెవలప్మెంట్ ఆఫీసర్ యల్లారెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మధుసూదన్, జూనియర్ ఇంజినీర్ సుధీర్, సంస్థాపక వెండర్స్ పాల్గొన్నారు.

లాంగ్ మార్చ్‌ను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - కడప : వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా మే 4న నిర్వహించే లాంగ్‌మార్చ్‌ను విజయవంతం చేయాలని మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్‌బాషా పేర్కొన్నారు. మంగళవారం కడప నగరంలోని తన నివాస కార్యాలయంలో పిఎసి సభ్యులతో సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముందు కాశ్మీర్ రాష్ట్రంలోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో మరణించిన వారికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు జమాల్ వలి, నిత్యానంద రెడ్డి, కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

సొమ్ము ఒకరిది సోకొకరిది : వైసిపి

ప్రజాశక్తి - కడప



మాట్లాడుతున్న వెల్లాల రామకృష్ణారెడ్డి

కడప నగరం బుగ్గవంక రక్షణ గోడలపై ఫెన్సింగ్ ఏర్పాటుకు తాము అన్ని చర్యలు తీసుకుంటే ప్రస్తుత ఎమ్మెల్యే మాధవి తమ ఘనతగా చెప్పుకోవడం తగదని వైసిపి ఆర్‌టిఐ జిల్లా అధ్యక్షులు వెల్లాల రామకృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం వైసిపి కడప జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బుగ్గవంక పరిసరాల్లో దుర్వాసన రాకుండా, వంక పూడిపోకుండా ఉండేందుకు తాము బుగ్గవంక బ్రిడ్జిపై నుంచి చెత్తా చెదారాలు, కోళ్ల వ్యర్థాలు, ఇతర పనికి రాని వస్తువులు వేయకూడదని తమ డివిజన్ కార్పొరేటర్, తాను చొరవ తీసుకుని కార్పొరేషన్‌లో జరిగిన సమావేశంలో ప్రతిపాదనలుపెట్టి నిధుల విడుదలను ఆమోదింపజేసుకున్నారన్నారు. ఇటువంటి తరుణంలో ఎమ్మెల్యే తాను ఏదో ఘన కార్యం చేసినట్లు ఈ విషయంగా ప్రచారం చేసుకోవడం తగదన్నారు. స్థానిక కార్పొరేటర్‌గా, వైసిపి ఇన్‌ఛార్జి తమ డివిజన్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. వైసిపి హయాంలోనే కడప నగరం అన్ని విధాల అభివృద్ధి చెందగా, దానిని ఎమ్మెల్యే తన వల్లనే అన్ని పనులు జరిగాయని చెప్పుకోవడం తగదన్నారు. సమావేశంలో వైసిపి నాయకులు సుబ్బరాయుడు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్

కడప ఉక్కుపై మోడీ ప్రకటన చేయాలి

2న అంబేద్కర్ సర్కిల్లో నిరసన
సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రధాని నరేంద్ర మోడీ మే 2న అమరావతి పర్యటన సందర్భంగా కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ప్రభుత్వ రంగంలో ఏర్పాటు చేస్తామని ప్రకటన చేసేలా చంద్రబాబు నాయుడు చొరవ చూపాలని సిపిఎం నగర కార్యదర్శి ఎ.రామమోహన్ డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని మృత్యుం జయ కుంటలో ఉన్న సిపిఎం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన సందర్భంగా విభజన చట్టంలో కడప ఉక్కు పరిశ్రమని 6 నెలల లోపు ఏర్పాటు చేస్తామని స్పష్టంగా హామీ ఇచ్చారన్నారు. నేటికీ 10 సంవత్సరాలు దాటినా కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు శిలాఫలకాలకే పరిమితమైంది తప్ప ఆచరణలో నిర్మాణం చేపట్టడం లేదన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ రాష్ట్ర పర్యటన సందర్భంగా కడప జిల్లా ఉక్కు పరిశ్రమ ఏర్పాటుపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. రాయలసీమ ప్రాంతంలో నిరుద్యోగం, పేదరికం, కరువు విళయతాండవం చేస్తున్నాయని, వీటి బారి నుంచి ప్రజానీకానికి ఉపశమనం కల్పించడానికి కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. అమరావతి ఏర్పాటు సందర్భంగా గతంలో రాష్ట్రానికి మట్టి, నీరు ఇచ్చి రాష్ట్ర ప్రజానీకాన్ని ఘోరంగా అవమానించారని తెలిపారు. వేల కోట్ల రూపాయలు అప్పు అవసరం లేదని, కేంద్ర ప్రభుత్వం గ్రాంట్ గా అవసరమైన నిధులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్య పరిష్కారం కోసం మే 2 అంబేద్కర్ సర్కిల్లో ప్రధాని పర్యటన సందర్భంగా నిరసన కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ప్రజానీకం పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు దస్తగిరిరెడ్డి, నగర కమిటీ సభ్యులు చంద్రారెడ్డి, వెంకటేశ్వర్లు, నగర నాయకులు గోవిందు, తిమ్మయ్య పాల్గొన్నారు.

చదరంగంతో ఏకాగ్రత పెరుగుతుంది

ప్రజాశక్తి - కడప అర్బన్




జిరాఫీ చెస్ ను వివరిస్తున్న పిఇటి భారతి

చదరంగం వల్ల విద్యార్థులకు జ్ఞాపకశక్తి, ఏకాగ్రత పెరుగుతుందని ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ భారతి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపు రెండవ రోజున జిరాఫీ చెస్, పర్యావరణం పరిరక్షణ మీద తరగతులు నిర్వహించారు. పిఇటి భారతి జిరాఫీ చెస్ ఆడటంలో మెలుకువలు నేర్పించారు. చదరంగం ఆడడం వల్ల వి మానసిక ఉత్తేజాన్ని కలిగిస్తుందని చెప్పారు. సృజనాత్మకత, ప్రణాళికా నైపుణ్యాలు, వ్యూహాత్మక ఆలోచనా సామర్థ్యం పెరుగుతాయని తెలిపారు. సాధారణ చదరంగంలో గేమ్ డ్రా అవుతుందని, జిరాఫీ చదరంగం అనేది కొత్త డ్రా లెస్ బోర్డ్ గేమ్ అన్నారు. దీనిని 68 చదరపు బోర్డుపై ఆడతారని పేర్కొన్నారు. ప్రామాణిక చెస్ బోర్డుకు ప్రతి వైపు జిరాఫీలను జోడిస్తారని తెలిపారు. అనంతరం జనవిజ్ఞాన వేదిక నాయ కులు దేవదత్తం మొక్కలు పెంపకం వల్ల పర్యావరణంలో జరిగే మార్పులను పాట రూపంలో వివరించారు. క్యూబ్, ఫజిల్స్‌ను విద్యార్థులకు చరణ్ నేర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ ఎలిశెట్టి పవన్, లైబ్రేరియన్స్ యస్.వి.సుబ్రమణ్యం, కె.నవాబ్ జాన్, టి.సురేష్, జేమ్స్, ఎస్.గౌస్ బాష, కె.సుబ్బమ్మ, క్రాఫ్ట్ టీచర్ రంగనాయకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా రాజ్యాంగ పరిరక్షణ ప్రచార ఉద్యమం : డిసిసి

ప్రజాశక్తి - కడప



సమావేశంలో మాట్లాడుతున్న విజయజ్యోతి

రాజ్యాంగ పరిరక్షణ ప్రచార ఉద్యమం జిల్లా వ్యాప్తంగా నిర్వహించాలని, అందుకు తగ్గట్టుగా కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసినట్లు డిసిసి అధ్యక్షులు ఎన్.డి. విజయ జ్యోతి తెలిపారు. మంగళవారం కడప నగరంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో పార్టీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మే నెలలో నిర్వహించే సంవిధాన్ బచావో అభియాన్ కార్యక్రమానికి సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. సమావేశంలో ఆయా నియోజకవర్గం, మండల స్థాయి కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సామాజిక అంశాలపై అవగాహన

ప్రజాశక్తి - కడప : కిశోర వికాసం సమ్మర్ క్యాంప్ ద్వారా యువతకు సామాజిక అంశాలపై అవగాహన కల్పించాలని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ, మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ, సాధికారిక అధికారి డి. శ్రీలక్ష్మి అన్నారు. మంగళవారం ఆన్‌లైన్ ద్వారా కిశోర వికాసం సమ్మర్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి గ్రామం, వార్డుల్లో కిశోర బాలికలకు ముఖ్యంగా 15- 18 మధ్య వయసు కలిగిన అమ్మాయిలకు గ్రూప్స్ ఏర్పాటు చేసి ప్రతి మంగళ, శుక్రవారాల్లో మహిళా సంరక్షణ కార్యదర్శి కన్వీనర్‌గా వ్యవహరిస్తూ అంగన్వాడి వర్కర్స్ విఒహెచ్ లు కలిసి దాదాపు 12 అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించాలని అన్నారు. సమావేశంలో సిడిపిఒలు, సూపర్‌వైజర్లు, మహిళా పోలీసులు, ఎఎన్ఎం, మండల డెవలప్మెంట్ అధికారులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న సిబ్బంది

రక్తదానంతో ప్రాణదాతలు కండి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ఎస్ఎంఎస్ జిఎం శ్రీనివాసరావు, సీనియర్ మేనేజర్ రామకృష్ణ, డిజిఎం రాములు పేర్కొన్నారు. మంగళవారం తుమ్మలపల్లి ఎస్ఎంఎస్ క్వార్టర్స్‌లో రక్తదాన శిబిరాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్ఎంఎస్ కంపెనీ మాజీ చైర్మన్ అభయ్ సన్ చీటీ జయంతి సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు ఎస్ఎంఎస్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ ఖలీల్ సౌదాగర్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరంలో సుమారు వందమంది కార్మికులు రక్తదానం చేశారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయడం వల్ల మన ఆరోగ్యంతోపాటు ఇతరుల ప్రాణాలు కాపాడినట్లు అవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పవన్‌కుమార్, సీనియర్ ఎగ్జిక్యూటివ్ సురేష్‌కుమార్, అనంతపురం జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులతో పుస్తకాలను చదివిస్తున్న అమీరుద్దీన్

వేసవి శిబిరాలను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - వేముల

వేసవిలో నిర్వహిస్తున్న సమ్మర్ ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌ను విజయవంతం చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి అమీరుద్దీన్ కోరారు. వేముల గ్రంథాలయంలో నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పిల్లలతో కథలు చదివించారు. పిల్లలకు కథలు చెప్పడం, కథలు చదివించడం, సృజనాత్మక కృత్యాలను, డాన్స్, క్యారమ్స్, చెస్, డ్రాయింగ్ తదితర వాటిని నిర్వహిస్తామన్నారు. చిన్నతనంలోనే గ్రంథాలయానికి రావడం అలవాటు చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ నారుబోయిన గంగాధర్ యాదవ్, పాఠకులు శ్రీనివాసులు, అబ్దుల్ వలి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐటిఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెలోని శ్రీకందుల ఓబుళరెడ్డి చారిటీస్ ఐటిఐలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆయా ట్రేడ్స్‌లో ప్రవేశానికి 10వ తరగతి పాసైన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపల్ ప్రసాద్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, సివిల్, డీజిల్ మెకానిక్, వెల్డర్, ప్లంబర్ కోర్సులున్నట్లు తెలిపారు. 10వ తరగతి పాసైన విద్యార్థులు అర్హులని చెప్పారు. మే నెల 20వ తేదీ లోపు దరఖాస్తులు ఇస్తే ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేస్తామని తెలిపారు. ప్లంబర్ కోర్సుకు 10వ తరగతి ఫెయిల్ అయిన అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు అన్నారు. వివరాలకు వేంపల్లె ఐటిఐలో సంప్రదించాలని ఆయన సూచించారు.

జిసిఆర్ఆర్ ఐటిఐలో..

ముద్దనూరు : తాడిపత్రి రహదారిలోని గజ్జల చిన్న రంగారెడ్డి మెమోరియల్ ప్రయివేట్ లిమిటెడ్ ఐటిఐలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మంగళవారం ప్రిన్సిపల్ సుబ్బారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐటిఐలో డీజిల్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ ట్రేడ్లు ఉన్నాయన్నారు. ఎస్సీ, ఎస్టీ, బిసి విద్యార్థులకు స్కాలర్‌షిప్ సౌకర్యం ఉందన్నారు. ప్రయివేట్, ప్రభుత్వ సంస్థల్లో ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు చెప్పారు. ఆర్ఆర్‌బి, కాంపిటీషన్ పరీక్షలకు అనుభవజ్ఞులచే ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఐటిఐ చేసిన వారు రెగ్యులర్ డిగ్రీ చేరేందుకు అవకాశం ఉందన్నారు. ఇంటర్ షిప్ సౌకర్యం ఉందన్నారు.

వీరభద్ర స్వామి సన్నిధిలో వేలం పాట

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని అల్లాడుపల్లె శ్రీవీరభద్ర స్వామి దేవస్థానం సన్నిధిలో మంగళవారం వేలం పాట నిర్వహించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ వీరనారాయణ యాదవ్, ఇఒ శ్రీనివాసులు ఆధ్వర్యంలో 4ఎకరాల పొలం రూ.61 వేలకు, ఒక దుకాణం రూ.50,400కు వేలం వేశారు. టిటిడి కల్యాణ మండపానికి వేలం పాట ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

బహిరంగ వేలం వాయిదా

ప్రజాశక్తి - ముద్దనూరు

స్థానిక మేజర్ గ్రామ పంచాయతీకి సంబంధించి బస్టాండ్, జంతువధశాలకు రుసుం వసూళ్లు చేసుకునేందుకు మంగళవారం పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన బహిరంగ వేలం వాయిదా వేసినట్లు కార్యదర్శి లక్ష్మీ నరసింహులు తెలిపారు. జంతువధశాల వేలానికి కేవలం ఒక్కరు మాత్రమే డిపాజిట్ చెల్లించారన్నారు. బస్టాండ్ వేలానికి ఎవరు డిపాజిట్ చెల్లించలేదన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు వాయిదా వేసినట్లు కార్యదర్శి తెలిపారు.

క్రైం కార్నర్

కడుపునొప్పి తాళలేక యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - సింహాద్రిపురం



మృతి చెందిన ఆశీర్వాదం

మండలంలోని కోరగుంటపల్లిలో యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. గోపాల్ దాస్ ఆశీర్వాదం(17) కడుపునొప్పి తాళలేక మంగళ వారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. తండ్రి యేసురత్నం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ చంద్రమోహన్ రెడ్డి తెలిపారు.

మోటర్ల దొంగలను పట్టుకున్న రైతులు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని అరటి తోటల్లో వరుస దొంగతనాలు రైతులను కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. సోమవారం రాత్రి పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని వెంకటాపురం గ్రామం అరటి తోటలో దొంగతనానికి వచ్చిన ఇద్దరు దొంగలను రైతులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. వీరిని పోలీసులు విచారిస్తున్నారు. కొంతకాలం నుంచి వెంకటాపురం, వెలమవారిపల్లి తదితర ప్రాంతాల తోటలలోని విద్యుత్ మోటర్ల వైర్లు, స్టార్టర్లు, ఫీజు క్యారియర్లు చోరీకి గురవుతున్నాయి. తోటల్లో దొంగలకు కాపలా కాస్తూ నిద్రలేని రాత్రులు గడుపుతున్నామని రైతులు పేర్కొంటున్నారు. అదుపులోకి తీసుకున్న ఇద్దరితో సమాచారాన్ని రాబట్టి దొంగలందరిని కట్టడి చేయాలని రైతులు కోరుతున్నారు.

రేపటి నుంచి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా సేవలు

- ఎపిజిబితోపాటు విలీనం కానున్న మరో నాలుగు బ్యాంక్‌లు



విలీనం కానున్న సింహాద్రిపురం ఎపిజిబి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

జిల్లాలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు(ఎపిజిబి) పేరు ఇకపై మారనుంది. రాష్ట్రంలోని నాలుగు బ్యాంకులను విలీనం చేసి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా గురువారం నుంచి ఖాతాదారులకు సేవలు అందించనుంది. రాష్ట్రంలోని ఉత్తరాంధ్రలో పనిచేస్తున్న ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు, కోస్తా ఏరియాలో చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్, రాయలసీమ పరిధిలోని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్, చిత్తూరు జిల్లాలోని సప్తగిరి గ్రామీణ బ్యాంకు ఇదివరకు ఆయా జిల్లాల పరిధిలో పని చేస్తున్నాయి. ఈ నాలుగు బ్యాంకులు కలిపి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులో విలీనం కానున్నాయి. ఇప్పటివరకు రాష్ట్రంలోని గ్రామీణ బ్యాంక్ సేవలు ఆయా జిల్లాల పరిధిలోనే ఖాతాదారులకు సేవలు అందించేవారు. అయితే నాలుగు బ్యాంకుల విలీనంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మొత్తం ఖాతాదారులకు సేవలు అందునున్నాయి. గతంలో నగదు బదిలీ కావాలంటే ఆయా బ్యాంకుల పరిధిలోనే జరిగేవి. మే ఒకటి నుంచి రాష్ట్రమంతా ఖాతా దారులకు నగదు బదిలీ సులభతరం కానుంది. ప్రస్తుతానికి ఖాతాదారుల నెంబర్లు, ఐఎఫ్‌సి కోడ్, బ్యాంకు చిరునామాలు పాతవి కొనసాగుతున్నాయి. త్వరలోనే మార్పు చెందే అవకాశం ఉందని బ్యాంకు ఉన్నతాధికారులకు పేర్కొంటున్నారు.

ఖాతాదారులకు సేవలు మరింత సులభతరం

నాలుగు బ్యాంకుల విలీనంతో ఖాతాదారులకు సేవలను మరింత సులభతరం కానున్నాయి. రాష్ట్ర మొత్తం ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ సేవలు అందనున్నాయి. ఖాతాదారులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యం.

- కృష్ణ కిషోర్, ఎపిజిబి మేనేజర్, సింహాద్రిపురం


విద్యుత్ నియంత్రికలు.. ప్రమాద ఘంటికలు

ప్రజాశక్తి - ఖాజీపేట

విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం.. పనితీరు వెరసి విద్యుత్ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. సామాన్య ప్రజల ప్రాణాలకు రక్షణ లేకుండా ఉంది. విద్యుత్ నియంత్రికులు రోడ్డు పక్కనే ఏర్పాటు, తీగలు కిందకు వేలాడుతుండడం, పంట పొలాలలో ఒరిగిన విద్యుత్ స్తంభాల వల్ల ప్రమాదాలు పొంచి ఉన్నా.. రక్షణ చర్యలు మాత్రం చేపట లేకపోతున్నారు. వివిధ ప్రాంతాలలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. ప్రధాన రహదారులకు పక్కనే ఏర్పాటు చేయడం వల్ల ప్రమాదాలు పొంచి ఉన్నాయని స్థానికులు భయాందోళన వ్యక్తపరుస్తున్నారు. విద్యుత్ నియంత్రికలు అతి తక్కువ ఎత్తులో ఉండడంతో చిన్నారులకు ప్రమాదం పొంది ఉందని బెంబేలెత్తుతున్నారు. వివరాల్లోకెళ్తే.. స్థానిక మైదుకూరు రోడ్డులోని ఓ ట్రాన్స్‌ఫార్మర్ కార్యాలయానికి సమీపంలో ఏర్పాటు చేసిన విద్యుత్ నియంత్రికులు రహదారి పక్కనే ఉన్నాయి. ఈ దారి గుండా చిన్నారులు ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ట్రాన్స్ ఫార్మర్‌ను మార్పు చేయడమో, దాని చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే పత్తూరు నుంచి ధయాంఖాన్ పల్లెకు వెళ్లే మార్గంలో ప్రధాన వీధికి సమీపంలో నియంత్రిలు ఏర్పాటు చేశారు. ఈ మార్గానికి ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుండడంతో పాటు పొగాకు పరిశ్రమలు అధికంగా ఉన్నాయి. పొగాకు ఉత్పత్తుల రవాణాతో వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. ఏమాత్రం ప్రమాదం చోటుచేసుకున్నా భారీ మూల్యం చెల్లించక తప్పదు. ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను మార్చాలని చాలా కాలంగా స్థానికులు కోరుతున్నా అధికారులు పట్ట నట్లు న్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చ ర్యలు చేపట్టి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ధయాంఖాన్‌పల్లె-పత్తూరు ప్రధాన దారికి పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్



విద్యుదీపాలతో బ్రహ్మంగారి ఆలయం

4 నుంచి బ్రహ్మంగారి ఆరాధనోత్సవాలు

- పిట్‌పర్సన్ శంకర్ బాలాజీ ఆధ్వర్యంలో వేగవంతంగా ఏర్పాట్లు

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

మండలంలోని కందిమల్లయపల్లె గ్రామంలో సజీవ సమాధి నిష్ఠ వహించిన జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి ఆరాధన గురుపూజ మహోత్సవాలు మే 4నుంచి నిర్వహించనున్నారు. ఫిట్ పర్సన్ శంకర్ బాలాజీ ఆధ్వర్యంలో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు పనులు వేగవంతం చేశారు. మే 4న ఆదివారం ఉదయం తెల్లవారుజామున 5గంటలకు ప్రారంభం కానున్నాయి. 5వ తేదీ సోమవారం శ్రీవీరబ్రహ్మ సుప్రభాత నామ సంకీర్తన, ఎనిమిది గంటలకు అభిషేకం, సహస్రనామార్చన తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 6, 7, 8, 9న పలు పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నామని మఠం పిట్ పర్సన్ శంకర్ బాలాజీ, మేనేజర్ ఈశ్వరయ్యాచారి తెలిపారు. భక్తులు ప్రశాంత వాతావరణంలో స్వామివారిని దర్శించుకునేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయనున్నట్లు వారు వివరించారు.

మేడేను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు



మాట్లాడుతున్న సత్యనారాయణ

మేడేను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి కొర్రపాటి సత్యనారాయణ కోరారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గురువారం ఉదయం 9 గంటలకు స్థానిక ప్రభుత్వాసుపత్రి నుంచి ర్యాలీ ప్రారంభమై, బంగారు అంగళ్ల మీదుగా శివాలయం సర్కిల్ చేరుకుం టుందన్నారు. అనంతరం అక్కడ సభ జరుగు తుందని తెలిపారు. కార్యక్ర మంలో సిఐటియు అనుబంధ రంగాల ప్రతి కార్మికులు పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమాల్లో భాగంగా ప్రొద్దుటూరులో వారం రోజులపాటు సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు మే డేను ప్రజల్లోకి తీసుకుపోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ కార్యదర్శి సాల్మన్, సిఐటియు పట్టణ కార్యదర్శి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

జక్కాజ్యోతి ఫుడ్స్ ఆధ్వర్యంలో నేడు ట్రయల్ రన్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు టౌన్

రాయలసీమ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి పీ ఫోర్ డెవలప్మెంట్ ప్లానింగ్ ప్రకారం ప్రొద్దుటూరు కొర్రపాడు రోడ్డులోని జక్కాజ్యోతి ఫుడ్స్ వారి ఆధ్వర్యంలో ట్రయల్ రన్ బుధవారం సాయంత్రం ప్రారంభించనున్నారు. కార్యక్రమానికి కడప, జమ్మలమడుగు, మైదుకూరు, ప్రొద్దుటూరు, నుండి పాల్గొననున్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జక్కాజ్యోతి ఫుడ్స్ సిఇఒ జక్కా పెద్దన్న మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉద్యోగం కల్పించడం, వర్క్ ఫ్రం హెూం కల్పించడం పి ఫోర్ ఉద్దేశమన్నారు. లక్ష నుండి 5 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. జక్కా జ్యోతి ఫుడ్స్ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి అందరూ విచ్చేసి జయప్రదం చేయాల్సిందిగా పెద్దన్న కోరారు. కార్యక్రమంలో మేనేజర్ అజయ్, సిఎఫ్ఓ రాజా పాల్గొన్నారు.

నేడు లైట్లు స్విచ్ ఆఫ్‌తో నిరసన

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు



మాట్లాడుతున్న సలీం

వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా బుధవారం లైట్ల స్విచ్ ఆఫ్ చేసి నిరసన తెలపాలని జెఎసి పిలుపు నిచ్చిందని సభ్యులు షేక్ సలీం తెలిపారు. ఆ మేరకు మంగళ వారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు ప్రొద్దుటూరు జెఎసి ఆధ్వర్యంలో బుధవారం రాత్రి 9 నుంచి 9:15 నిమిషాల వరకు లైట్ స్విచ్ ఆఫ్ చేసి నిరసన వ్యక్తం చేయనున్నట్లు తెలిపారు. లౌకికవాదులు, రాజ్యాంగ పరిరక్షణ వాదులు, కులమతాలకు అతీతంగా ప్రజలందరూ రాజ్యాంగ వ్యతిరేకమైన ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఇళ్లు, కార్యాలయాలు, అంగళ్లు కర్మాగారాలు, కంపెనీలలో లైట్ స్విచ్ ఆఫ్ చేసి నిరసన కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. మౌలానా మక్బూల్ అహ్మద్ పాల్గొన్నారు.

అవస్థలు పడుతున్న ఎయిర్‌టెల్ వినియోగదారులు

- పట్టని యాజమాన్యం : సిపిఎం

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

వారం రోజులుగా మండలంలో ఎయిర్‌టెల్ వినియోగదారులు అవస్థలు పడుతున్నారని, యాజమాన్యం పట్టించుకోవడంలేదని సిపిఎం మండల కార్యదర్శి గండి సునీల్‌కుమార్ పేర్కొన్నారు. గంటల తరబడి సిగ్నల్స్ లేకపోవడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన బ్రహ్మంగారిమఠానికి వచ్చే భక్తులు, వ్యాపారస్తులు అసౌకర్యానికి గురవుతున్నారని తెలిపారు. ముఖ్యంగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు నెట్ వర్క్‌లేక గంటల తరబడి వేచి చూస్తూ.. అధికారులకు సమాధానం చెప్పుకోలేక ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. ఎయిర్‌టెల్ యాజమాన్యం స్పందించి ఆ ఇబ్బందులు తొలగించాలని ఆయన కోరారు. లేనిపక్షంలో ఆందోళన చేపడుతామని ఆయన హెచ్చరించారు.

మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి పరామర్శ

ప్రజాశక్తి - ఖాజీపేట

పత్తూరు మాజీ సర్పంచ్, టిడిపి సీనియర్ నాయకులు సారే పిచ్చినాయుడు కుటుంబ సభ్యులను మంగళవారం మాజీ ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి పరామర్శించారు. కేన్సర్ వ్యాధితో బాధపడుతూ ఇటీవల పిచ్చి నాయుడు మృతి చెందిన విషయం తెలిసిందే. వైసిపి నాయకులు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, వైసిపి జిల్లా జాయింట్ సెక్రటరీ పివి రాఘవరెడ్డి, కెసి కెనాల్ ప్రాజెక్టు మాజీ వైస్ చైర్మన్ రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి పత్తూరు వెళ్లి పరా మర్శించారు. రఘురామిరెడ్డి మాట్లాడుతూ పిచ్చినాయుడు మృతి బాధాకర మన్నారు. తమ కుటుంబానికి ఎంతో అత్యంత ఆప్తులని పేర్కొన్నారు. పిచ్చి నాయుడు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్య క్రమంలో వైసిపి నాయకులు, సర్పంచులు భూమన సుబ్బారెడ్డి, దొరవారి రాముడు, ముత్తూరు వెంకటసుబ్బయ్య, ముత్తూరు వెంకటరమణ పాల్గొన్నారు.



పిచ్చి నాయుడు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే

మంచినీటి పథకాలకు పరిరక్షణ కరువు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలో పలు గ్రామాలలో మంచినీటి పథకాలను గాలికి వదిలేశారు. నెలలో ఒకసారి కూడా వాటిని శుభ్రం చేయడం లేదు. గతంలో పంచాయతీల ద్వారా ప్రతి 15 రోజులకు ఒకసారి మంచినీటి పథకాలను శుభ్రం చేసేవారు. ప్రస్తుతం నెలల తరబడి వాటిని పట్టించుకునే నాథుడు కరువయ్యారు. మంచినీటి పథకాలకు తీగజాతి వ్యర్థ మొక్కలు అల్లుకుపోతున్నాయి. మంచినీటి పథకాల ద్వారా సరఫరా అయ్యే నీటిలో కూడా వ్యర్థ పదార్థాలు అధికంగా వస్తున్నాయి. వీరభద్రపురం వద్ద మంచినీటి పథకానికి చుట్టూ మొక్కలు ఏపుగా పెరిగి పరిసరాలు అధ్వానంగా ఉన్నాయి.

ద్వారకా నగరం వద్ద ఉన్న మంచినీటి పథకం కూడా పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి అసౌకర్యంగా ఉంది. డైరెక్ట్ పంపింగ్ ద్వారా నీటి సరఫరా జరిగే గ్రామాలలో సమస్య లేదు.. కానీ మంచినీటి పథకాల అందుబాటులో ఉన్న గ్రామాల్లో నీరు పరిశుభ్రంగా లేదని ప్రజలు పేర్కొంటున్నారు. గతంలో ప్రభుత్వం మంచినీటి పథకాలను తరచూ శుభ్రం చేయిం చేవారు. సర్పంచులకు నిధులు సరిగా మంజూరు కాకపోవడంతో మంచినీటి పథకాలను పూర్తిగా గాలికి వదిలేశారు. ఇప్పటికైనా అన్ని గ్రామాలలో మంచినీటి పథకాలను శుభ్రం చేయించి, బ్లీచింగ్ పౌడర్‌తో నీటిని శుభ్రం చేయిస్తే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది. మంచినీటి పథకాల చుట్టూ శుభ్రంగా ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.



వీరభద్రాపురం వద్ద పిచ్చి మొక్కలు అల్లుకొని అధ్వానంగా ఉన్న మంచినీటి పథకం



కొత్త రహదారిని పరిశీలిస్తున్న పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, గ్రామస్తులు

హిమకుంట్లలో రహదారి వెడల్పు పనులు పూర్తి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని హిమకుంట్లలో రహదారి వెడల్పు, డ్రయినేజీ పనులు పూర్తికాడంతో కొత్త శోభ నెలకొంది. గ్రామం మొదట్లో రహదారి చాలా ఇరుకుగా ఉండడంతో వాహనదారులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బంది పడేవారు. ఈ ప్రదేశంలో తరచూ ప్రమాదాలు జరుగుతుండేవి. గత ఏడాది లింగాల మండలం అంకెవాని పల్లెకు చెందిన ఓ వ్యక్తి ఇదే ప్రాంతంలో ప్రమాదం జరగడంతో మృతి చెందారు. స్పందించిన మాజీ జెడ్పిటిసి పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి రోడ్డు పక్క భూమి ఉన్న యాజమాని చవ్వా రామగోపాల్ రెడ్డితో సుమారు 15 సెంట్ల స్థలాన్ని రూ.5.76 లక్షలకు కొనుగోలు చేశారు. రోడ్డుకు మరోవైపు కూడా సుమారు రూ.1.50 లక్షలు రైతుకి ఖర్చు చేసి కొంత భూమి కొనుగోలు చేశారు. దీంతోపాటు సొంత నిధులు మరో రూ.7.50 లక్షలతో రహదారి వెడల్పు పనులు మొదలు పెట్టి రోడ్డు, డ్రయినేజీ పనులు పూర్తిచేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రాజకీయ జోక్యంతో వేంపల్లెకు రాని అధికారులు

- డిప్యూటీ సిఎం పవన్‌కు తులసిరెడ్డి లేఖ

ప్రజాశక్తి - వేంపల్లె

కూటమి ప్రభుత్వ పాలనలో రాజకీయ జోక్యం ఎక్కువ కావడంతో వేంపల్లె పంచాయతీ కార్యదర్శిగా అధికారులు ఎవరూ రావడం లేదని పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వేంపల్లె పంచాయతీలో ఉన్న సమస్యలపై డిప్యూటీ సిఎం, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్‌కు తులసిరెడ్డి లేఖ రాశారు. పులివెందుల ఎమ్మెల్యే జగన్ మోహన్‌రెడ్డి కూడా వేంపల్లె మేజర్ పంచాయతీని పట్టించుకోలేదన్నారు. దాదాపు 60 వేల జనాభా ఉన్న వేంపల్లెకు పంచాయతీ కార్యదర్శి లేకపోవడంతో మురికి కూపంగా తయారైందన్నారు. 6 నెలల నుండి జీతాలు చెల్లించకపోవడంతో సిబ్బంది పనులు అంతంత మాత్రంగానే చేస్తున్నట్లు చెప్పారు. పంచాయతీ పరిధిలోని 8 గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న 60 మంది సిబ్బంది రెండు నెలలుగా జీతాలు అందలేదని తెలిపారు. పంచాయితీ రాజ్ శాఖ మంత్రిగా కనీసం మీరైనా వేంపల్లె పంచాయతీపై దృష్టి సారించి ఏ మాత్రం ఆలస్యం చేయకుండా తక్షణం ఇఒ, ఇఓపిఆర్డీలను నియమించాలని తులసిరెడ్డి కోరారు.

బాలకృష్ణకు పద్మభూషణ్‌పై హర్షం

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రముఖ సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్ పురస్కారం అందజేయడం హర్షణీయమని బాలకృష్ణ అభిమానుల సంఘం ప్రతినిధులు, టిడిపి నాయకులు మంగళవారం తెలిపారు. ఈ ఏడాది గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పురస్కారాల్లో బాలకృష్ణకు పురస్కారం లభించడం తెలుగు ప్రజానీకానికే గర్వకారణమన్నారు. బాలకృష్ణ అభిమానులు సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు నాగపట్నం రామసుబ్బయ్య, పత్తూరు ఉపసర్పంచి ముత్తూరు రమణ, రమేష్ నాయుడు, నరసింహ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి - చాపాడు

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి తెలిపారు. అక్షయ తృతీయను పురస్కరించుకొని బాల్య వివాహాలు జరిగే అవకాశాలు ఉన్నందున మండల పరిధిలో బాల్య వివాహాలు నిర్మూలించుటకు ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అల్లాడుపల్లె అంగన్వాడీ కేంద్రంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలపై ప్రజల్లో అవగాహన కల్పిం చాలన్నారు. బాల్య వివాహాలు జరిగే అవకాశం ఉంటే వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ 1098కి, సూపర్‌వైజర్, సిడిపిఓ కార్యాలయానికి కానీ సమాచారం అందించాలని తెలిపారు. బాల్య వివాహాలు జరిపించు వారందరూ శిక్షార్హులని హెచ్చరించారు.



కార్నియాలను అందజేస్తున్న లక్ష్మీదేవి కుటుంబ సభ్యులు

నేత్రదానానికి ప్రతి ఒక్కరూ సహకరించాలి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్ నేత్రదానానికి ప్రతి ఒక్కరూ సహరించాలని స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు కోరారు. మంగళవారం పట్టణంలోని కచేరి రోడ్‌లో నాగయ్య ఆశ్ర మంలో నివాసం ఉంటున్న కడుమూరు లక్ష్మీదేవి మరణిం చడంతో ఆశ్రమం నిర్వాహ కులు రమాదేవి, అంధుల ఆశ్రమం నిర్వాహకులు రామ్‌మోహన్, వెంకటేష్, వెంకటమ్మ, గంగమ్మ నేత్రదానానికి అంగీకరించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షులు రాజుకు సమాచారం ఇవ్వడంతో టెక్నీషియన్ హరీశ్ మృత దేహం నుంచి కార్నియాలను సేకరించి హైదరాబాద్ డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపించారు. నేత్రదానం చేయ దలచినవారు 70932 04537, 99665 09364కు సమాచారం ఇవ్వాలని సూచించారు.



ట్రాఫిక్ నియంత్రణకు ఎమ్మెల్యే చొరవ చూపాలి

ప్రజాశక్తి-మదనపల్లె : పట్టణం శర వేగంగా విస్తరించడం, చుట్టుప్రక్కల ప్రాంతాల నుండి ప్రతీరోజు రైతులు, వ్యాపారులు, దినసరి కూలీలు, ప్రభుత్వ, ప్రయివేటు ఉద్యోగులు, విద్యార్థుల రాకపోకలతో నిత్యం వేలాది వాహనాలతో పట్టణం కిక్కిరిసి పోతుండడంతో తీవ్ర ట్రాఫిక్ సమస్యతోందని మదనపల్లి టౌన్ అపెక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ గొల్లపూడి తిరుపతిరావు పేర్కొన్నారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషాను మదనపల్లె టౌన్ అపెక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు టి.ఎస్.ఎ.కృష్ణమూర్తి, బాలసుబ్రమణ్యం, వై.ఎస్.మునిరత్నం, కె.వెంకటరమణ, రవిప్రకాష్, రాజారెడ్డి, జయచంద్రారెడ్డి, నారాయణరెడ్డి, అప్పినపల్లి భాస్కరాచారి, రెడ్డప్ప, సురేష్ కుమార్ రెడ్డి, ఆదిరెడ్డి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తిరుపతిరావు మాట్లాడుతూ ప్రస్తుతం కేవలం ట్రాఫిక్ చెక్ పోస్టు మాత్రమే ఉందని, ట్రాఫిక్ నియంత్రణకు తగినంత సిబ్బంది లేకపోవడంతో నియంత్రణ చాలా కష్టతరంగా మారిందన్నారు. శాశ్వత పరిష్కారంగా మదనపల్లె పట్టణంలో పూర్తిస్థాయి ట్రాఫిక్ పోలీస్ స్టేషను ఏర్పాటు చేసి, అవసరమైన సిబ్బందిని కేటాయించాలని ఎమ్మెల్యే షాజహాన్ బాషాకి వినతిపత్రం ఇచ్చామన్నారు. కావున ఈ విషయంలో శాసనసభ్యులు చొరవ తీసుకొని పూర్తిస్థాయిలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయించి పట్టణ ప్రజలకు ట్రాఫిక్ సమస్యల నుండి విముక్తి కల్పించాలని కోరారు.

మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

పని ప్రదేశంలో సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలి
- కలెక్టర్ చామకూరి శ్రీధర్



మహిళలతో కలిసి షీబాక్స్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి

పని ప్రదేశంలో ఏర్పడే సమస్యలను మహిళా ఉద్యోగులు ఆత్మస్థైర్యంతో ధైర్యంగా ఎదుర్కొని ముందుకు సాగాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి పిలుపునిచ్చారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్‌లో అమరావతి ఎపి జెఎసి జిల్లా శాఖ ఏర్పాటు చేసిన 'షీబాక్స్'ను మహిళా ఉద్యోగులతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం కలెక్టరేట్‌లో మినీ వీడియో కాన్ఫరెన్స్‌లో మహిళా ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ మహిళల సమస్యలపై 'షీబాక్స్'ను ఏర్పాటు చేయడం శుభపరిణామన్నారు. ప్రధానంగా మహిళా ఉద్యోగులు పనిచేస్తున్న ప్రదేశంలో ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలను బయట చెప్పడానికి లేదా లైంగిక వేధింపుల అంశాలలో తమ పేర్లు బయట పెట్టడానికి చాలామంది ఇష్టపడుట లేదన్నారు. మహిళలు తమ సమస్యల పరిష్కారం దిశగా ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలన్నారు. ఏదైనా సమస్యపై మహిళలు ఫిర్యాదు చేయడమే కాకుండా వాటిని ఎదుర్కోవడం సమస్యపై ధైర్యంగా నిలబడే విధంగా చైతన్యవంతులు కావాలన్నారు. వాస్తవిక సమాచారం ఆధారాలతో తమ దృష్టికి వచ్చిన ఏ సమస్య నైనా తప్పకుండా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం కూడా మహిళా ఉద్యోగుల సంక్షేమంతో పాటు పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పనకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కలెక్టరేట్‌లో మహిళలకు ప్రత్యేకంగా టాయిలెట్ల నిర్మాణం కూడా చేపట్టామని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రతి కార్యాలయంలో మహిళలకు విడిగా టాయిలెట్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. షీబాక్సును ఏర్పాటు చేయడం మాత్రమే కాకుండా దానిని తగువిధంగా పర్యవేక్షణ చేయాలని, మహిళల్లో అవగాహన పెరిగేందుకు ఏపీ జెఎసి మహిళా సభ్యులు కృషి చేయాలని పేర్కొన్నారు జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న మహిళలు ఏదేని సమస్యలు తమ దృష్టికి తీసుకువచ్చినపుడు వాటి పరిష్కార దిశగా కృషి చేస్తున్నామన్నారు. ఒక మహిళ ఉద్యోగికి ఏదైనా సమస్య వస్తే తోటి మహిళా ఉద్యోగులు అండగా ఉండాలని, సమస్యలను ధైర్యంగా ఎదుర్కొనే దిశగా అవగాహన పెంచాలన్నారు. ప్రతి మహిళా ఉద్యోగి షి బాక్సును సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో అమరావతి ఎపిజెఎసి జిల్లా చైర్మన్, రాయచోటి తహశీల్దార్ నరసింహ కుమార్, జనరల్ సెక్రెటరీ వైష్ణవి మాట్లాడుతూ మహిళా ఉద్యోగులు కొన్ని సమస్యలను మౌఖికంగా తెలపలేకపోవచ్చునారు. రాతపూర్వకంగా అర్జీతో అధికారిని కలవాలన్న కొద్దిగా బిడియం, భయపడే పరిస్థితిలో కొంతమంది ఉన్నారు. అలాంటి వారికి భరోసా కల్పిస్తూ వారి సమస్యలు తెలుపుకునే ఒక అవకాశం కల్పించాలని భావనతో రాష్ట్ర ప్రభుత్వం అంగీకారంతో ఎపి జెఎసి వారు షీ బాక్సులను ఏర్పాటు చేయాలని సంకల్పించిన మేరకు నేడు కలెక్టరేట్‌లో బాక్సు ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. జిల్లాలో మూడు డివిజన్‌లో తమ శాఖ సబ్ కమిటీలను ఏర్పాటు చేసుకొని, మహిళా ఉద్యోగులందరూ చక్కగా పనిచేసుకోవాలనే సదుద్దేశంతో సమస్యల పరిష్కారం దిశగా కృషి చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో డిఆర్ఒ మధుసూదన్ రావు, ఎపిజెఎసి మహిళా ప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖల మహిళ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు

- త్వరలో ఉచిత బస్సు సౌకర్యం ప్రారంభం
- ఆర్‌టిసి జోనల్ చైర్మన్ పూల నాగరాజు

ప్రజాశక్తి - కడప అర్బన్

ఏపీ రోడ్డు రవాణా సంస్థ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, త్వరలో ఉచిత బస్సు సౌకర్యం ప్రారంభమవుతుందని ఆర్‌టిసి జోనల్ చైర్మన్ పూల నాగరాజు పేర్కొన్నారు. మంగళవారం కడప ఆర్‌టిసి బస్టాండ్‌కు చేరుకున్న ఆయనకు డి.ఎం డిల్లేశ్వరరావు స్వాగతం పలికారు. బస్టాండ్ ఆవరణలో మొక్క నాటారు. బస్టాండ్, ఆ గ్యారేజీ, కార్గో సేవలు, ప్రయాణికులకు మంచినీటి సౌకర్యం ఉందా లేదా, నూతన బస్టాండులో జరుగుతున్న సిమెంట్ రోడ్డు పనులను పరిశీలించారు. ప్రయాణికులకు అందుతున్న సేవలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉద్యోగులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌టిసి బస్టాండులలో పరిస్థితులు ఎలా ఉన్నాయో అధ్యయనం చేస్తున్నామని పేర్కొన్నారు. నివేదికను తయారుచేసి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళతామన్నారు. ఎక్కడ ఏమి అవసరమో వాటిని సమకూర్చి మెరుగైన సౌకర్యాలను అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు త్వరలో ఉచిత బస్సుల సౌకర్యాన్ని ప్రారంభిస్తామని చెప్పారు. ఆర్‌టిసి ఆసుపత్రి సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ఆర్ఎం, ఇడి, డిఎం బాగా పనిచేస్తున్నారని కితాబిచ్చారు. మరిన్ని విద్యుత్ బస్సులు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. మోడ్రన్ బస్ స్టేషన్లు, జోన్-1, జోన్ -2 డిపోలు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తుందన్నారు. నెల రోజుల్లో నగరంలో సిటీ బస్సులను అందుబాటులోనికి తీసుకురావాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. ఆర్ఎం గోపాల్ రెడ్డి మాట్లాడుతూ మెరుగైన రవాణా సౌకర్యాన్ని ప్రజలకు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఇయు నాయకులు చైర్మన్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఇడి చంద్రశేఖర్, అసిస్టెంట్ మేనేజర్ కన్యాకుమారి, సూపరింటెండెంట్ మంజుల, ఇయు అధ్యక్షులు కుమార్, కార్యదర్శి రాజశేఖర్, ఆర్‌టిసి ఉద్యోగులు పాల్గొన్నారు.



బస్టాండ్ సేవలను అడిగి తెలుసుకుంటున్న చైర్మన్ పూల నాగరాజు

గ్రామీణ బ్యాంకుల్లో అగ్రగామి ఎపిజిబి

- రూ.50,757 కోట్ల వ్యాపారం
- ఎపిజిబి చైర్మన్ సత్య ప్రకాష్ సింగ్



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ సత్య ప్రకాశ సింగ్

ప్రజాశక్తి - కడప అర్బన్

ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ రూ.23,667 కోట్ల డిపాజిట్లు, రూ.27,090 కోట్ల రుణాలతో మొత్తం రూ.50,757 కోట్ల వ్యాపారంతో దేశంలోని గ్రామీణ బ్యాంకులలో అగ్రగామిగా ఉందని బ్యాంకు చైర్మన్ సత్య ప్రకాష్ సింగ్ పేర్కొన్నారు. మంగళవారం కడపలోని మరియాపురం రోడ్డులో ఉన్న ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు కాన్ఫరెన్స్ హాల్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎపిజిబి 2024-25 ఏడాదికి రూ.639 కోట్ల నికర ఆదా యం అర్జించిందని తెలిపారు. అతి తక్కువ మొండి బకాయిలున్నాయని చెప్పారు. రాష్ట్రంలోని 10 జిల్లాల పరిధిలోని 56 లక్షల ఖాతాదారులకు అన్ని రకాల బ్యాంకింగ్ సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. 6,90,538 రైతులకు రూ.8,798 కోట్ల పంట రుణాలు, 1,20,653 మహిళా సంఘాల గ్రూపులకు రూ.6,867 కోట్ల రుణాలు మంజూరు చేశామన్నారు. అన్ని రకాల ఆధునిక సాంకేతిక సదుపాయాలను బ్యాంకు అందిస్తుందని తెలిపారు. ప్రగతి విద్యా జ్యోతి పథకం ద్వారా ఎస్‌సి, ఎస్‌టి బాలికలకు ఒక్కొక్కరికి రూ.5 వేలు చొప్పున 482 మందికి స్కాలర్‌షిప్స్ అందజేశామని చెప్పారు. మే ఒకటి నుంచి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు మరింత మెరుగైన సేవలు రాష్ట్రమంతటా అందిస్తుందని తెలి పారు. సమావేశంలో జనరల్ మేనేజర్లు హరికేశ్వర ప్రసాద్, పడిగేటివార్, సంజీ వప్ప, రాజేంద్రన్, చీఫ్ మేనేజర్లు, ప్రధాన కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలను వేధించిన సూపర్‌వైజర్‌ను తొలగించాలి

- సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.చంద్రశేఖర్



ఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న సిఐటియు నాయకులు, మహిళలు

ప్రజాశక్తి-ఓబులవారిపల్లె (పుల్లంపేట)

ఎపిఎండిసి పబ్లిక్ స్కూల్ నాన్ టీచింగ్ మహిళలను వేధించిన సూపర్‌వైజర్ జమాల్‌ను విధుల నుంచి తొలగించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సి.హెచ్.చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఎపిఎండిసి పబ్లిక్ స్కూల్ నాన్ టీచింగ్ సిబ్బందిని, హౌస్ కీపింగ్, స్కావెంజర్స్, కేర్ టేకర్‌గా పనిచేస్తున్న మహిళలను లైంగిక వేధింపులకు గురిచేస్తున్న జమాల్‌పై మహిళ వేధింపుల కేసు నమోదు చేయాలని కోరుతూ మంగళవారం ఎస్ఐ మహేష్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ గతంలో అనేకసార్లు కాంట్రాక్టర్ మహేష్, హెడ్మాస్టర్ గౌరావతి, సిపిఒ సుదర్శన్‌రెడ్డికి ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. గత ఏడాది ఫిబ్రవరి 2వ తేదీన హెచ్ఎం ద్వారా ఎండికి ఫిర్యాదు చేశామని గుర్తు చేశారు. ఇటీవల మహిళలు కూడా చైర్మన్ రూపానందరెడ్డి, ఎమ్మెల్యే అరవ శ్రీధర్ దృష్టికి కూడా సమస్యలను తీసుకెళ్లామని తెలిపారు. కూడా చైర్మన్, స్కూల్ కమిటీ చైర్మన్ మహేష్‌కి ఫోన్ చేసి జమాల్‌ని పక్కన పెట్టమని గతంలో ఆదేశించారన్నారు. నెల మాత్రమే జమాల్‌ని పక్కనపెట్టి తిరిగి బాధ్యతలు అప్పజెప్పడం ఫలితంగా వారిపై మరింత కక్ష పెంచుకొని తిరిగి రెట్టింపు వేధింపులకు గురిచేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. లక్ష్మీ అనే కేర్ టేకర్ శనివారం మధ్యాహ్నం గార్డెన్‌లో పనిచేసుకుంటూ ఉంటే జమాల్ ఫోటోలు తీశాడన్నారు. ఎందుకు ఫోటోలు తీసుకున్నావని అడిగినందుకు మీ ఇంట్లో తీశానా, అని బెదిరిస్తూ మీది మీదికి వచ్చి దాడికి ప్రయత్నించాడని తెలిపారు. ఆత్మ రక్షణ కోసం జమాల్‌ను పక్కకు తోసిందని అక్కడ పనిచేస్తున్న మరో నలుగురు మహిళా కార్మికులు ఎందుకు ఇటువంటి పనులు చేస్తున్నావని అడిగేసరికి వారిని కూడా నానా బూతులు తిట్టాడన్నారు. విజిల్ వేయడం, కను సైగల్ చేయడం, మహిళ బాత్రూం డోర్లు తట్టడం, డబుల్ మీనింగ్ మాట్లా డడం, తాను చెప్పినట్లుగా నడుచుకుంటే పని ఏమీ చెప్పనని లేకుంటే వేధింపులు తప్పవని బెదిరించడం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ విషయంపై హెచ్ఎం రేవతికి ఫిర్యాదు చేయగా ఎటువంటి చర్యలు తీసుకోకపోగా, పై అధికారులను ప్రశ్నిస్తావా అని ఆ మహిళను రేపటి నుండి డ్యూటీకి రావద్దని ఆదేశించినదని పేర్కొన్నారు. ఈ విషయంపై యూనియన్ నాయకులు పాఠశాలకు వచ్చిన కాంట్రాక్టర్ మహేష్‌ను నిలదీయగా ఎటువంటి స్పందన లేదని సిపిఒకు చెప్పు కోండి అనే సమాధానం చెప్పి వెళ్లిపోయాడన్నారు. ఎటువంటి నోటీసులు లేకుండా కారణం చెప్పకుండా బాధితులని నోటి మాటలతో విధులకు రావద్దని చెప్పడంతోటి మహిళలు ఆగ్రహం వ్యక్తం చేసి అందరూ విధులు బహి ష్కరించి సుదర్శన్‌రెడ్డికి ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి పెంచలయ్య, బాధితులు లక్ష్మీ సురేఖ, లక్ష్మీ, ప్రసన్న, జయలక్ష్మి, హేమలత, సౌజన్య, రాజమణి, లింగమ్మ, సుగుణ, మేరీ, వరలక్ష్మి, రాధా, మాణిక్యమ్మ పాల్గొన్నారు.



గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న లక్ష్మీప్రసాద్‌రెడ్డి

టిడ్కో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలి

ప్రజాశక్తి - రాయచోటి

టిడ్కో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు ఇవ్వాలని రాయచోటి నియోజకవర్గం టిడిపి నాయకులు డాక్టర్ లక్ష్మీప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రాయచోటి మండల పరిధిలోని దిగువ అబ్బవరంలో నిర్మిస్తున్న టిడ్కో ఇల్ల నిర్మాణాలను టిడిపి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రాంత పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం టిడ్కో ఇళ్లను మంజూరు చేసిందని చెప్పారు. ఇందుకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న టిడ్కో ఇళ్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయించాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు.టీడ్కోలో రోడ్డు పనులు, డ్రెయినేజీ, విద్యుత్తు, నీటి సౌకర్యం వంటి మౌలిక వసతులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు .రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ఉన్నత ఆశయంతో పేదలకు నిర్మిస్తున్న టీడ్కో ఇళ్ల నిర్మాణాలను ఎట్టి పరిస్థితులలో నిర్లక్ష్యం చేయరాదన్నారు. కార్యక్రమంలో అధికారులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మత్స్యకారులకు అండగా ప్రభుత్వం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మత్స్యకారులకు అండగా కూటమి సర్కార్ నిలిచిందని, వేట నిషేధ సమయంలో రూ.20 వేలు చొప్పున 1,29,178 మత్స్యకార కుటుంబాలకు రూ.259 కోట్లు విడుదల చేసి ఆదుకుందని జిల్లా బెస్త సాధికార కమిటీ జిల్లా అధ్యక్షులు ముంబై దుర్గా స్పష్టం తెలిపారు. మత్స్యకార భరోసా పెంపు నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గా మాట్లాడుతూ వేట నిషేధ సమయంలో ఆర్థికసాయం రెట్టింపు చేసి విడుదల చేయడం పట్ల మత్స్యకారులకు లబ్ధి జరిగిందన్నారు. మత్స్యకార కుటుంబాలు, గ్రామాలు టిడిపికి అండగా నిలబడ్డాయిన్నారు. వెనుకబడిన వర్గాల సంక్షేమమే తెలుగుదేశం ధ్యేయమని మరోమారు రుజువైందన్నారు. 2014-2019 మధ్య మత్స్యకారుల సంక్షేమం కోసం రూ.788 కోట్లు ఖర్చు పెట్టడంతో పాటు వలలు, పడవలు, ఐస్ బాక్సులు అదనంగా ఇచ్చిన విషయం గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణమూర్తి, భాస్కర, మురళి, మల్లికార్జున, బాలాజీ, రెడ్డి, మల్లయ్య పాల్గొన్నారు.



సిఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం మత్స్యకారులు



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

శంకర్ నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రపంచ ప్రసిద్ధి గాంచిన శంకర నేత్రాలయ చెన్నై వారి మొబైల్ ఐ సర్జికల్ యూనిట్ పుట్టపర్తి టీం, ఎఆర్ఎస్ఆర్ చారిటబుల్ ఫౌండేషన్ వారి సంయుక్త ఆధ్వర్యంలో మదనపల్లె జిఆర్‌టి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. యుఎస్ బోర్డు మెంబర్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ఈ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. 82 మందికి స్క్రీనింగ్ పరీక్షలు చేసి సమస్యలను గుర్తించారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ సర్వేంద్రియానం నయనం ప్రధనమని, అన్ని ఇంద్రియాల కంటే మనిషికి కన్ను ఎంతో ప్రాముఖ్యమైందన్నారు. ప్రతి ఒక్కరూ తరచూ కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ భానుప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ ఈ శిబిరంలో పాల్గొన్న వారికి స్క్రీనింగ్ టెస్ట్‌ల ద్వారా శుక్లం లేదా కంటి పొరను గుర్తించి ఇక్కడే ఉచితంగా శస్త్ర చికిత్స చేయడంతో పాటు ఉచితంగా మందులు అందివ్వనునట్లు తెలిపారు. కార్యక్రమంలో బిటి కాలేజీ కరస్పాండెంట్ వైఎస్.మునిరత్నం, జిఆర్‌టి స్కూల్ ప్రిన్సిపల్ జగన్మోహన్, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎన్.మునిగోపాల కృష్ణ, రామచంద్ర, లోకల్ వాలంటీర్స్ మల్లూరి నారాయణ రెడ్డి, రామకృష్ణ, శ్రీనివాసులు, చిన్న, గంగాధర్ పాల్గొన్నారు.

రెండో రోజూ ఆర్‌టిసి ఉద్యోగుల రిలేదీక్షలు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోరుతూ నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉద్యోగులు మంగళవారం రెండో రోజు రిలే నిరహార దీక్ష చేశారు. రాయచోటి డిపో వద్ద సుమారు 10 మంది ఉద్యో గులు రిలే నిరాహార దీక్షలో కూర్చున్నారు. రీజినల్ అధ్యక్షుడు ఎంఎస్ రావు, కార్యదర్శి పిఎస్ఎం రాజు హాజరై దీక్షలు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ డిమాండ్ల పరిష్కారం కోరుతూ ఈ నెల 2, 3వ తేదీల్లో ఎర్రబ్యాడ్జీలతో విధులకు హాజరై నిరసన తెలిపామని, 10, 11వ తేదీల్లో గేట్ ధర్నాలు చేసి 17న ప్లకార్డులతో నిరసనతో సమస్యలను ప్రభుత్వం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. అయినప్పటికీ స్పందించకపోవడంతో రెండు రోజుల పాటు రిలే దీక్షలకు పూనుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రీజినల్ నాయకులు సివి రమణ, ఎమ్మెస్ ప్రసాద్, టి.రామాంజులు, డిపో నాయకులు ఆర్.బి.గోపాల్, డిఎస్.వాసులు, ఎం.రెడ్డప్ప, ఐ.సుధాకర్, కె.హరినాథ, ఎంహెచ్.నాయుడు, కార్మికులు పాల్గొన్నారు.

లోకేష్‌ను కలిసిన వేణుగోపాల్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్ విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌ను విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వంలో ఏదో ఒక నామినేట్ పదవి ఇవ్వాలని లోకేష్‌ను కోరగా ఆయన సానుకూలంగా స్పందిస్తూ సరైన సమయానికి సరైన పదవి ఇస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. పార్టీ కోసం కష్టపడిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని లోకేష్ భరోసా ఇచ్చారన్నారు.

బహిష్కరణ చేసిన వారిపై కేసు నమోదు చేయాలి

ప్రజాశక్తి-పీలేరు

కాకినాడ జిల్లా, పిఠాపురం నియోజకవర్గం, మల్లాం గ్రామంలో ఎస్సీలపై సంఘ బహిష్కరణ అమలు చేసిన అగ్రకులాల పెత్తందారులపై ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కేసు నమోదు చేయాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మాలమహానాడు మండల యూత్ అధ్యక్షులు జెట్టి దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో సిఐ పి.యుగంధర్‌కు ప్రజాసంఘాల నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణ్ కుమార్, సిపిఐ నాయకులు తపాయి వెంకటేష్, మం డల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దుబ్బా శ్రీకాంత్, అఖిల భారత బంజారా సేవా సంఘం నాయకులు మూడే హరి నాయక్ మాట్లాడుతూ పిఠాపురం నియోజకవర్గం మల్లాం గ్రామంలో ఎస్సీలను సంఘ బహిష్కరణను తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రభుత్వాలు అగ్రవరా?ల చేతుల్లో ఉన్నంతకాలం, ఆర్థిక, అంగ, అధికార బలం వారి చేతుల్లో ఉన్నంతకాలం ఎస్సీ, ఎస్టీలపై అరాచకాలు తప్పవని ఆవేదన వ్యక్తం చేశారు. నిందితులను గుర్తించి వారిపై ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కేసు నమోదు చేయాలని మరోసారి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బిస్మిల్లా ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు షేక్ బోడేషా వలి, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కె.నరసింహులు, మాల మహానాడు సీనియర్ నాయకులు ఆర్.ద్వారకనాథ్, రెడ్డెయ్య, ఆటో యూనియన్ నాయకులు అత్తర్ ఇబ్రహీం, బావాజీ, మౌలా, రిజ్వాన్, అక్రమ్, సుబ్బరాజు, రమణ, ఖాదర్ బాషా, వెంకటరమణ, మస్తాన్, శీన, ప్రభుతేజ, అఫ్జల్ పాల్గొన్నారు.

పనులు పరిశీలించిన సర్పంచ్, ఇఒ

ప్రజాశక్తి-పీలేరు

గ్రామ పంచాయతీకి ఐఎస్ఒ సర్టిఫికేషన్ సాధనలో భాగంగా చేపట్టిన సుందరీకరణ పనులను సర్పంచ్ డాక్టర్ షేక్ హబీబ్ బాష, ఇఒ గురుమోహన్ పరిశీలించారు. మంగళవారం వారు పంచాయితీ కార్యాలయంలోపల, వెలుపల చేపట్టిన పనులను తనిఖీ చేస్తూ మార్పు, చేర్పుల కోసం సంబంధిత సిబ్బందికి తగిన సూచనలు సలహాలు ఇచ్చారు. కార్యాలయానికి కార్పొరేట్ స్థాయి హంగులు తేవడానికి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ సందరేగా వారు మాట్లాడుతూ అంతర్జాతీయ ప్రమాణీకరణ సంస్థ (ఐఎస్ఒ) సాధించడం ద్వారా పీలేరు గ్రామపంచాయతీని అభివృద్ధి పథంలో నడపడానికి అవసరమైన అదనపు, ప్రత్యేక నిధుల సాధనలో భాగంగా కార్యాలయానికి వచ్చే ప్రజలకు సౌకర్యంగా నిరీక్షణ గది, హెల్ప్ లైన్ డెస్క్, పౌర సేవల సూచిక బోర్డు, స్వచ్ఛమైన త్రాగునీరు, మరుగుదొడ్లు, చంటి పిల్లలకు తల్లులు పాలు పట్టడానికి సౌకర్యంగా గది, రికార్డుల ఆన్‌లైన్ నిర్వహణ, నిర్దేశిత సమయంలో పౌరులకు సేవలు అందించే సౌకర్యం, కార్యాలయంలో ఆహ్లాదకర వాతావరణం ఉండేలా సుందరీకరణ పనులు వంటి పనులు చేపట్టినట్లు చెప్పారు.



సుందరీకరణ పనులను పరిశీలిస్తున్న సర్పంచ్, ఇఒ



మాట్లాడుతున్న ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రోహిణి

బాల్య వివాహాలను అరికట్టాలి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

చిన్న వయస్సులోనే బాల్య వివాహాలు చేయడం వలన బాలికలు అనేక రుగ్మతులను ఎదుర్కోవాల్సిన దుస్థితి ఏర్పడుతుందని స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ రోహిణి అన్నారు. మంగళవారం స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో మహిళా పోలీసులు, ఆశ, ఎఎన్ఎం, అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిషోరి వికాసం కార్యక్రమంలో భాగంగా బడిమానేసిన బాలికలను గుర్తించి బడిలో చేర్పించడం, బాల్య వివాహాలను అరికట్టడం, బాలికలను రక్షించడం, బాలికలకు సాధికారత కల్పించడం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎంలు, ఆశవర్కర్లు, మహిళా పోలీసులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఎపిడిఇఇ సెట్ నోటిఫికేషన్ విడుదల

ప్రజాశక్తి - రాయచోటి

రాష్ట్రంలో రెండు సంవత్సరాల డిప్లమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డిఇఎల్ఇడి) కోర్సులో ప్రవేశానికి డిఇఇ సెట్-2025 నోటిఫికేషన్ విడుదలైందని డైట్ కళాశాల ప్రిన్సిపల్ ఎం.ఆర్.ఎస్. అజయ్‌కుమార్ బాబు మంగళ వారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత ఉన్న అభ్యర్థులు మే 8 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు అని తెలిపారు. మే 20న హాల్ టికెట్లు విడుదల అవుతాయన్నారు. జూన్ 2, 3వ తేదీల్లో పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. జూన్ 10న ఫలితాల విడుదల అవుతాయన్నారు. పరీక్షా కేంద్రాల ఎంపిక, అభ్యర్థుల అర్హతల నిబంధనలు, కోర్సు ఎంపిక విధానం వంటి పూర్తి సమాచారం కోసం https://apdeecet.apcfss.in అధికారిక వెబ్‌సైట్ సందర్శించాలని తెలిపారు.ప్రాథమిక విద్యకు నాణ్యతను తీసుకొచ్చే భవిష్యత్ టీచర్లకు ఇది మంచి అవకాశమని, సమయానికి దరఖాస్తు చేసుకొని పరీక్షకు సన్నద్ధం కావాలని అభ్యర్థులను కోరారు.

బాలకృష్ణకు పద్మభూషణ్‌పై హర్షం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

సినీ నటుడు నందమూరి బాలకృష్ణకు పద్మభూషణ్ అవార్డును ఢిల్లీలో రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకున్న సందర్భంగా మదనపల్లి బాలయ్య ఫ్యాన్స్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. భవిష్యత్తులో బాలకృష్ణ మరిన్ని అవార్డులు అందుకొని ప్రజలు అభిమానుల హృదయాల్లో స్థిరంగా నిలిచిపోవాలని ఆకాక్షించారు. ఈ సందర్భంగా మదనపల్లి బాలయ్య ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షులు యర్రబల్లి వెంకటరమణారెడ్డి, రాష్ట్ర చేనేత నాయకులు బొమ్మిశెట్టి పురుషోత్తం, ముదిమడుగు రామ్మూర్తి, ప్రభాకర్, డాన్స్ రెడ్డెన్న, కోన భాస్కర్, కాశీ శ్రీరామ్, శంకర్, వేమయ్య, లతీఫ్, రామ సుబయ్య, ముదివేడు శ్రీరాములు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు చెప్పారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నటనలో తండ్రి నందమూరి తారక రామారావు వారసత్వం పునికి పుచ్చుకోవడంతో పాటు, ఎమ్మెల్యేగాను, బసవతారకం కేన్సర్ ఆసుపత్రిలో వైద్య సేవలు అందించడంలోను అయనకు ఆయనే సాటి అని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులను అలంకరించడమే కాకుండా మరిన్ని పురస్కారాలతో ప్రజల హృదయాలను కొల్లగొట్టాలని ఆకాంక్షించారు.


ఉపాధి కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు అందిస్తున్న మహబూబ్‌బాషా

'ఉపాధి' కూలీలకు మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని నీలకంఠరావుపేట ఉపాధి పనులు చేస్తున్న 320 మంది కూలీలకు ఉప సర్పంచ్ మహబూబ్‌బాషా ఆధ్వర్యంలో ఫీల్డ్ అసిస్టెంట్ పెంచల్ రెడ్డి తో కలిసి మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేస విని దృష్టిలో ఉంచుకొని ఎండ వేడిమి నుంచి కూలీలకు కొంత ఉపశమనం కలిగిం చేందుకు మజ్జిగను పంపిణీ చేసినట్లు తెలిపారు. కూలీలు వడదెబ్బకు గురి కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కూలీలు ఉప సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పోలీసుల అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

కాశ్మీర్‌లోని పహల్గాంలో ఇటీవల జరిగిన ఉగ్రదాడి సంఘటనల నేప థ్యంలో ఈ నెల 27వ తేదీ నుంచి మదనపల్లి సబ్ డివిజన్ పరిధిలో డిఎస్‌పి ఆదేశాల మేరకు 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉందని ఎస్ఐ తిప్పేస్వామి పేర్కొన్నారు. మండల ప్రజలు పోలీసుల అనుమతులు లేకుండా ఎటువంటి ర్యాలీలు, ధర్నాలు చేయకూడదని సూచించారు. అటువంటి వాటికి ముందస్తుగా పోలీసుల అనుమతి తీసుకోవాలని తెలిపారు. ప్రజలు గుంపులు గుంపులుగా ఒకేచోట ఉండరాదన్నారు. మండలంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ, పోలీసుల ఆదేశాలను ఉల్లంఘించి ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకలు నిర్వహిస్తే అటువంటి వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మరోవైపు వేసవి కాలంలో పాఠశాలలకు సెలవులు ఉన్నందున మండలంలోని చెరువులలోకి, నీటి గుంతలలోకి, బహుధా ప్రాజెక్టులోకి పిల్లలు ఈత కోసం వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలన్నారు. పిల్లలపై నిఘా లేకపోతే ఈత కోసం వెళ్ళిన చోట ప్రమాదాలు జరగవచ్చని అన్నారు.


పాలిటెక్నిక్ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపిడిఒ

పాలిసెట్ పరీక్ష కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి-కలికిరి

బుధవారం నుంచి జరగబోయే పాలిటెక్నిక్ పరీక్ష కేంద్రాలను ఎంపిడిఒ భానుమూర్తిరావు పరిశీలించారు. స్థానిక జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాలలోని అడ్మినిస్ట్రేషన్ భవనం, పాలిటెక్నిక్ కాలేజ్ కళాశాల, మూడు కేంద్రాల్లో 884 మంది విద్యార్థులు రాస్తున్నారు. ఈ సందర్భంగా పరీక్షలు రాసే విద్యార్థులకు పరీక్షకు రాసేందుకు అనువుగా తరగతి గదులు, తాగునీరు శానిటేషన్ ఏర్పాట్లను పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలు రాసే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ మహమ్మద్ రియాజుద్దీన్, ఇఒ జి.అశోక్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ ఎంపిపి మృతి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి


రాధమ్మ(ఫైల్ ఫొటో)

మండలం పరసుతోపు పంచాయతీ బోయపల్లెకు చెందిన మాజీ ఎంపిపి కురిమి రాధమ్మ (టిడిపి) అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం ఉదయం మృతి చెందారు. 2014లో రాధమ్మ టిడిపి తరపున ఎంపిటిసి గెలిచి తంబళ్లపల్లె ఎంపిపిగా పనిచేశారు. రాధమ్మ మృతి పట్ల అన్ని పార్టీల నాయకులు, గ్రామస్థులు సంతాపం తెలిపారు.

రాజకీయ జోక్యంతో వేంపల్లెకు రాని అధికారులు

- డిప్యూటీ సిఎం పవన్‌కు తులసిరెడ్డి లేఖ

ప్రజాశక్తి - వేంపల్లె

కూటమి ప్రభుత్వ పాలనలో రాజకీయ జోక్యం ఎక్కువ కావడంతో వేంపల్లె పంచాయతీ కార్యదర్శిగా అధికారులు ఎవరూ రావడం లేదని పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వేంపల్లె పంచాయతీలో ఉన్న సమస్యలపై డిప్యూటీ సిఎం, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్‌కు తులసిరెడ్డి లేఖ రాశారు. పులివెందుల ఎమ్మెల్యే జగన్ మోహన్‌రెడ్డి కూడా వేంపల్లె మేజర్ పంచాయతీని పట్టించుకోలేదన్నారు. దాదాపు 60 వేల జనాభా ఉన్న వేంపల్లెకు పంచాయతీ కార్యదర్శి లేకపోవడంతో మురికి కూపంగా తయారైందన్నారు. 6 నెలల నుండి జీతాలు చెల్లించ కపోవడంతో సిబ్బంది పనులు అంతంత మాత్రంగానే చేస్తున్నట్లు చెప్పారు. పంచాయతీ పరిధిలోని 8 గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న 60 మంది సిబ్బంది రెండు నెలలుగా జీతాలు అందలేదని తెలిపారు. పంచాయితీ రాజ్ శాఖ మంత్రిగా కనీసం మీరైనా వేంపల్లె పంచాయతీపై దృష్టి సారించి ఏ మాత్రం ఆలస్యం చేయకుండా తక్షణం ఇఒ, ఇఓపిఆర్డీలను నియమించాలని తులసిరెడ్డి కోరారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి - చాపాడు : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి తెలిపారు. అక్షయ తృతీయను పురస్కరించుకొని బాల్య వివాహాలు జరిగే అవకాశాలు ఉన్నందున మండల పరిధిలో బాల్య వివాహాలు నిర్మిలిం చుటకు ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అల్లాడుపల్లె అంగన్వాడీ కేంద్రంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలపై ప్రజల్లో అవగాహన కల్పిం చాలన్నారు. బాల్య వివాహాలు జరిగే అవకాశం ఉంటే వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ 1098కి, సూపర్‌వైజర్, సిడిపిఓ కార్యాలయానికి కానీ సమాచారం అందించాలని తెలిపారు. బాల్య వివాహాలు జరిపించు వారందరూ శిక్షాహర్హులని హెచ్చరించారు.

'గోపాలమిత్ర'ల గోడు పట్టదా..?

- శ్రమకు తగ్గ ఫలితం శూన్యం
- కనీస వేతనం చెల్లించాలని వేడుకోలు


పశువులకు టీకా వేస్తున్న గోపాలమిత్ర (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి- చిట్వేలి

పాడి పరిశ్రమలో రైతన్నలకు చేదోడు వాదోడుగా, సలహాదారుడుగా ఉన్న గోపాలమిత్ర సేవలు మాటల్లో చెప్పలేనిది. మండలానికి ముగ్గురు చొప్పున నియమితులైన గోపాలమిత్రాలు పిలవగానే మండలంలో గ్రామాల్లోకి రాత్రి పగలు తేడా లేకుండా టక్కున వచ్చి ఆ పశు వులకు ప్రథమ చికిత్స చేసి పాడి రైతులకు బాసటగా నిలు స్తున్నారు. చిట్వేలి మండలంలో కూడా ముగ్గురు గోపాలమిత్రలు పాడిరైతులకు అండగా సేవలు అందిస్తున్నారు. అయితే ఇంత శ్రమ కోర్చి సేవలు అందిస్తున్న వీరు 2001 వ సంవత్సరం నుండి ఇప్పటివరకు ఎన్నో ప్రభుత్వాలు మారాయి,కానీ వీరికి జీవనోపాధి భరోసా కరువైపోయాయి. ఉమ్మడి రాష్ట్రంలో ఏర్పాటైన ఈ గోపాలమిత్ర వ్యవస్థ మొదట్లో రూ.1200లు నుంచి రూ.6500 దగ్గర నిలిచిపోయింది. అప్పట్లో వీరిని గోపాలమిత్రగా ఎంపిక చేసిన తర్వాత తిరుపతి ఎస్‌వి యూనివర్సిటీలో వెటర్నరీపై శిక్షణ కూడా ఇచ్చారు. అత్యవసర పరిస్థితుల్లో గ్రామాలలో మూగజీవాలకు ప్రాణాలు కాపాడేందుకు వీరే దిక్కయ్యారు. పశు వైద్యులు బదిలీలపై వస్తున్నా, పోతున్నా వీరి సేవలు మాత్రం అక్కడ ఎప్పుడు అందుబాటులో ఉంటాయి. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా గత ప్రభుత్వం సచివాలయ సిబ్బందిని ఏర్పాటు చేసి వీరిని పక్కన పెట్టే ప్రయత్నాలు జరిగాయి. సుదీర్ఘకాలంగా మూగజీవాలకు సేవలు అందిస్తున్న గోపాల మిత్రులను అలాగే కొనసాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. వీరికి పాడి పరిశ్రమలో జంతువుల పట్ల అత్యంత నైపుణ్యత ఉండడం వలన గ్రామాల్లో రైతులు వీరిపైన ఎక్కువ శాతం ఆధారపడి సేవలందించుకుంటున్నారు. ఆరుగాలం చెమ టోడ్చి శ్రమించినా ప్రభుత్వం ఇచ్చే గౌరవ వేతనం కుటుంబ పోషణకు సరిపోవడం లేదని గోపాలమిత్రలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెరుగుతున్న ఖర్చుల దృష్ట్యా తమ కు కనీసం వేతనం చెల్లించాలని కోరుతున్నారు. పశుసంవర్ధక శాఖ నిర్వహిస్తున్న పశు గర్భకోశ చికిత్స వైద్య శిబిరాలు, గొర్రెలు, మేకల్లో నట్టల నివారణ.. పశుగ్రాసాల పెం పకం, పశువుల్లో టీకాల లాంటి అన్నిరకాల కార్యక్రమాల్లో కూడా పనిచేస్తూ సేవలంది స్తున్నామని గోపాలమిత్రలు చెబుతున్నారు. నెల వారీ లక్ష్యాల్లో ఒక్కోసారి వెనుకబడి గౌరవ వేతనాల చెల్లింపుల్లోనూ కోతలు పెడుతుండటంతో బతుకులు దినదిన గండం గా మారాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత 24 సంవత్సరాలుగా సేవలంది స్తున్న గోపాల మిత్రులను గమనించి ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

టిబి రోగుల సన్నిహితులకు పరీక్షలు

- డాక్టర్ కావ్య గంధ

ప్రజాశక్తి-కలికిరి

ప్రస్తుతం టిబి వ్యాధికి మందులు తింటూ చికిత్సలో ఉన్న రోగులలో కలిసి సన్నిహితంగా ఉండి కలిసి జీవించే వారు తప్పనిసరిగా సివై టీబి పరీక్ష చేయించు కోవాలని మెడిక్కుర్తి పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ కావ్యగంధ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కలికిరి సచివాలయం-2లో కటానియస్ ట్యూబర్కులిన్ టిబి టెస్టింగ్ శిబిరాన్ని నిర్వహించారు. ప్రస్తుతం టిబి వ్యాధికి చికిత్స తీసుకుంటూ ఉన్న రోగుల కుటుంబ సభ్యులు 18సంవత్సరాల పై బడిన వారికి సివై టిబి పరీక్ష నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కేవలం 0.1 ఎం.ఎల్ మందును ముంజెతి భాగంలో చర్మం పొరలలో ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. 48 గంటల అనంతరం పరీక్ష చేసిన ప్రదేశంలో 48-72 గంటల తరువాత నిర్దిష్ట పరిమాణం కంటే ఎర్రటి బోడిపే ఏర్పడితే టిబి వ్యాధి సంక్రమణగా నిర్ధారణ అవుతుం దన్నారు. ఎవరికైతే పాజిటివ్ ఫలితం వస్తుందో వారికి భవిష్యత్‌లో టిబి జబ్బు తప్పనిసరిగా వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుం దన్నారు. అందువల్ల వారికి భవిష్యత్‌లో టిబి బారిన పడకుండా ముంద స్తుగా మూడు నెలలు పాటు మందులు తినాలని, మందులను ఉచితంగా అందిస్తామని తెలిపారు. టిబి రోగితో సంబంధం ఉండే స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఈ పరీక్షలు చేయించుకుని భవిష్యత్‌లో టిబి వ్యాధికి గురి కాకుండా ముందస్తు చికిత్స పొందవచ్చును అన్నారు. సివై టిబి పరీక్షలు అన్ని సచివాలయాలలో ఉన్న ఎఎన్ఎంల దగ్గర చేస్తారని తెలి పారు. ఈ అవకాశన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్ర మంలో హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, టీబి పర్యవేక్షకులు నాగిరెడ్డి, ఎఎ ఎన్ఎంలు మాధవి, రమాదేవి, రాధా, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


కాంట్రాక్ట్ సివై టిబి పరీక్షల నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

బాలికల సంరక్షణ మనందరి బాధ్యత : సిడిపిఒ


మాట్లాడుతున్న సిడిపిఒ భారతి

ప్రజాశక్తి-కలికిరి

బాలికలను రక్షించడం అందరి బాధ్యత అని ఐసిడిఎస్ సిడిపిఒ భారతి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంఆర్‌సి భవనంలో సమ్మర్ క్యాంప్ కిశోర వికాసం గురించి ఎంఎస్‌కె, విఒఎ, ఆశ, ఎఎన్ఎం, అంగన్వాడీ కార్యకర్తలు, ఎడబ్యూటిలకు సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కిషోర్ బాలికల పట్ల అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. 15 నుంచి 18 సంవత్సరాలలోపు బాలికలకు బడి మూసేసిన, ఇంటి దగ్గర నుంచి కాలేజీలకు వెళ్లే వారికి, కిశోర వికాస లక్ష్యం బాలికలను రక్షించడం, సాధికారిత కల్పించడం, అభివృద్ధి చేయడం, లింగ సమానతను పరిష్కరించడంపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలను నిరోధించడం వల్ల గౌరవంగా స్వచ్ఛత జీవనాన్ని గడపడానికి ఈ కార్యక్రమము నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో సూపర్వైజర్ అరుంధతి, రెడ్డిసత్తాజ్ ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, పాల్గొన్నారు.

వేసవి శిక్షణా శిబిరం ఎంతో ఉపయుక్తం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు కురబలకోట మండలం శాఖ గ్రంథాలయంలో ఉచిత శిక్షణ శిబిరం రెండవ రోజుకు చేరుకుందని శాఖ గ్రంథాలయ అధికారి బి.చంద్రశేఖర్ నాయక్ తెలిపారు. మంగళవారం జరిగిన క్యాంపులో వాలంటీర్ శ్రీవల్లి పిల్లలకి పుస్తకాలు చదవడం, తెలుగు కథలు చెప్పడం, స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రంథాల అధికారి బి.చంద్రశేఖర్ నాయక్ మాట్లాడుతూ వేసవి సెలవులను దృష్టిలో ఉంచుకొని విద్యార్థులు సమ్మర్ క్యాంపుకు ఆసక్తిగా హాజరవుతున్నారని పేర్కొన్నారు. ఆహ్లాద కరమైన వాతావరణంలో సమ్మర్ క్యాంప్ జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. శాఖ గ్రంథాలయంలో పిల్లలకు మంచినీరు, వెలుతురు, గాలి ఉండేలా ఏర్పాట్లు చేశా మని తెలిపారు. వేసవి శిక్షణ శిబిరం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని, మండలంలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.


విద్యార్థులకు సూచనలు ఇస్తున్న గ్రంథాలయ అధికారి చంద్రశేఖర్ నాయక్

రేపటి నుంచి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా సేవలు

- ఎపిజిబితోపాటు విలీనం కానున్న మరో నాలుగు బ్యాంక్‌లు



విలీనం కానున్న సింహాద్రిపురం ఎపిజిబి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

జిల్లాలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు(ఎపిజిబి) పేరు ఇకపై మారనుంది. రాష్ట్రంలోని నాలుగు బ్యాంకులను విలీనం చేసి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా గురువారం నుంచి ఖాతాదారులకు సేవలు అందించనుంది. రాష్ట్రంలోని ఉత్తరాంధ్రలో పనిచేస్తున్న ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు, కోస్తా ఏరియాలో చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్, రాయలసీమ పరిధిలోని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్, చిత్తూరు జిల్లాలోని సప్తగిరి గ్రామీణ బ్యాంకు ఇదివరకు ఆయా జిల్లాల పరిధిలో పని చేస్తున్నాయి. ఈ నాలుగు బ్యాంకులు కలిపి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులో విలీనం కానున్నాయి. ఇప్పటివరకు రాష్ట్రంలోని గ్రామీణ బ్యాంక్ సేవలు ఆయా జిల్లాల పరిధిలోనే ఖాతాదారులకు సేవలు అందించేవారు. అయితే నాలుగు బ్యాంకుల విలీనంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మొత్తం ఖాతాదారులకు సేవలు అందునున్నాయి. గతంలో నగదు బదిలీ కావాలంటే ఆయా బ్యాంకుల పరిధిలోనే జరిగేవి. మే ఒకటి నుంచి రాష్ట్రమంతా ఖాతా దారులకు నగదు బదిలీ సులభతరం కానుంది. ప్రస్తుతానికి ఖాతాదారుల నెంబర్లు, ఐఎఫ్‌సి కోడ్, బ్యాంకు చిరునామాలు పాతవి కొనసాగుతున్నాయి. త్వరలోనే మార్పు చెందే అవకాశం ఉందని బ్యాంకు ఉన్నతాధికారులకు పేర్కొంటున్నారు.

ఖాతాదారులకు సేవలు మరింత సులభతరం

నాలుగు బ్యాంకుల విలీనంతో ఖాతాదారులకు సేవలను మరింత సులభతరం కానున్నాయి. రాష్ట్ర మొత్తం ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ సేవలు అందనున్నాయి. ఖాతాదారులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యం. **- కృష్ణ కిషోర్, ఎపిజిబి మేనేజర్, సింహాద్రిపురం**

వీరభద్ర స్వామి సన్నిధిలో వేలం పాట

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని అల్లాడుపల్లె శ్రీవీరభద్ర స్వామి దేవస్థానం సన్నిధిలో మంగళవారం వేలం పాట నిర్వహించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ వీరనారాయణ యాదవ్, ఇఒ శ్రీనివాసులు ఆధ్వర్యంలో 4ఎకరాల పొలం రూ.61 వేలకు, ఒక దుకాణం రూ.50,400కు వేలం వేశారు. టిటిడి కల్యాణ మండపానికి వేలం పాట ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


హార్సిలీహిల్స్‌లో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

సీనియర్ సిటిజన్స్ సేవలు స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మదనపల్లి సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అందరికీ ఆదర్శనీయంగా ఉన్నాయని రాష్ట్ర కార్యదర్శి సూర్య నారాయణ సుంకరి సంతృప్తిని వ్యక్తం చేశారు. మదనపల్లిలో జరిగిన ఇస్కప్ రాష్ట్ర మహ సభల్లో పాల్గొన్నారు. అనంతరం మదనపల్లిలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయాన్ని సందర్శించి కార్యక్రమాలను పరిశీలించారు. వయోవృద్ధుల సంక్షేమా నికి అభివృద్ధికి ఇవి ఎంతో దోహద పడుతున్నాయని కితాబునిచ్చారు. ముని గోపా లకృష్ణ వారి సతీమణి ధన లక్ష్మిలతో కలిసి హార్సిలీహిల్స్‌ను సందర్శించారు. మండు తున్న ఎండల్లో పచ్చ దనంతో నిండిన ప్రకృతిని వీక్షించి సేద తీరారు. ఈ సందర్భంగా సూర్య నారాయణ మాట్లాడుతూ మదనపల్లిలో మునిగోపాలకృష్ణ, ధన లక్ష్మిల సేవలు రాష్ట్రానికి ఆదర్శంగా ఉన్నాయన్నారు. ఆంధ్ర ఊటిగా పిలు వబడే హార్సిలీ హిల్స్ అందాలను తిలకించడం మరువలేని అనుభూతిని ఇచ్చిందని అన్నారు.


నేడు ఎగువపల్లెలో సివిల్ రైట్స్‌డే

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మండల పరిధిలోని తవళం పంచాయతీలోని ఎగువపల్లెలో బుధవారం పౌర హక్కుల పరిరక్షణ దినోత్సవ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ కె.అమర్నాథ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతినెల 30వ తేదీన క్రమ పద్ధతిలో మండలంలోని ఒక గ్రామంలో పౌర హక్కుల పరిరక్షణ దినోత్సవ సమావేశాన్ని నిర్వహిస్తూ, వారి సమస్యలను తెలుసుకొని పరిష్కరిస్తూ వస్తున్నామని అన్నారు. ఉదయం 11 గంటలకు ఎగువపల్లెలో సివిల్ రైట్స్ డే సమావేశం ప్రారంభమవుతుందని, అన్ని శాఖల మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు, సంబంధించిన నాయకులు, సమావేశానికి తప్పక హాజరు కావాలని అన్నారు.

నేత్రదానానికి ప్రతి ఒక్కరూ సహకరించాలి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్ నేత్రదానానికి ప్రతి ఒక్కరూ సహరించాలని స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు కోరారు. మంగళవారం పట్టణంలోని కచేరి రోడ్‌లో నాగయ్య ఆశ్ర మంలో నివాసం ఉంటున్న కడుమూరు లక్ష్మీదేవి మరణిం చడంతో ఆశ్రమం నిర్వాహ కులు రమాదేవి, అంధుల ఆశ్రమం నిర్వా హకులు రామ్‌మోహన్, వెంకటేష్, వెంకటమ్మ, గం గమ్మ నేత్రదానానికి అంగీ కరించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షులు రాజుకు సమాచారం ఇవ్వడంతో టెక్నిషియన్ హరీశ్ మృత దేహం నుంచి కార్ని యాలను సేకరించి హైద రాబాద్ డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపించారు. నేత్రదానం చేయ దల చినవారు 70932 04537, 99665 09364కు సమాచారం ఇవ్వాలని సూచించారు.


విద్యుదీపాలతో బ్రహ్మంగారి ఆలయం

4 నుంచి బ్రహ్మంగారి ఆరాధనోత్సవాలు

- పిట్‌పర్సన్ శంకర్ బాలాజీ ఆధ్వర్యంలో వేగవంతంగా ఏర్పాట్లు

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

మండలంలోని కందిమల్లయపల్లె గ్రామంలో సజీవ సమాధి నిష్ఠ వహించిన జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి ఆరాధన గురుపూజ మహోత్సవాలు మే 4నుంచి నిర్వహించనున్నారు. ఫిట్ పర్సన్ శంకర్ బాలాజీ ఆధ్వర్యంలో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిం చేందుకు పనులు వేగవంతం చేశారు. మే 4న ఆదివారం ఉదయం తెల్లవారుజామున 5గంటలకు ప్రారంభం కానున్నాయి. 5వ తేదీ సోమవారం శ్రీవీరబ్రహ్మ సుప్రభాత నామ సంకీర్తన, ఎనిమిది గంటలకు అభిషేకం, సహస్రనామార్చన తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 6, 7, 8, 9న పలు పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నామని మఠం పిట్ పర్సన్ శంకర్ బాలాజీ, మేనేజర్ ఈశ్వరయ్యాచారి తెలిపారు. భక్తులు ప్రశాంత వాతావరణంలో స్వామివారిని దర్శించుకునేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయనున్నట్లు వారు వివరించారు.

ఐటిఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెలోని శ్రీకందుల ఓబుళరెడ్డి చారిటీస్ ఐటిఐలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆయా ట్రేడ్స్‌లో ప్రవేశానికి 10వ తరగతి పాసైన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపల్ ప్రసాద్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, సివిల్, డీజిల్ మెకానిక్, వెల్డర్, ప్లంబర్ కోర్సులున్నట్లు తెలిపారు. 10వ తరగతి పాసైన విద్యార్థులు అర్హులని చెప్పారు. మే నెల 20వ తేదీ లోపు దరఖాస్తులు ఇస్తే ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేస్తామని తెలిపారు. ప్లంబర్ కోర్సుకు 10వ తరగతి ఫెయిల్ అయిన అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు అన్నారు. వివరాలకు వేంపల్లె ఐటిఐలో సంప్రదించాలని ఆయన సూచించారు.

క్రైం కార్నర్

ఈతకెళ్లి యువకుడు మృతి

ప్రజాశక్తి- బి.కొత్తకోట


బాలు (ఫైల్ ఫొటో)

ఈతకెళ్లి యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో జరిగింది. పట్టణంలోని జయశ్రీ కాలనీకి చెందిన టైలర్ బాలు(29) ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సలీహిల్స్‌లోని గంగోత్రి నదిలో ఈతకి వెళ్లి మృతి చెంది నట్లు స్నేహితులు చెబుతున్నారు. బాలు పట్టణంలోని ఆంజనేయస్వామి గుడి ముందర టైలర్ షాప్ నిర్వహిస్తూ జీవనం సాగించేవాడని తెలిపారు. మృత దేహాన్ని వెలికి తీయడం కోసం ప్రయత్నాలు చేపట్టాల్సి ఉంది. ఈ విషయంపై స్థానిక పోలీసులు విచారణ చేస్తున్నారు .పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. మృతుడికి తల్లి, మతిస్థిమితం లేని అన్న ఉన్నారని తెలిపారు.

భార్య మందలించిందని భర్త ఆత్మహత్య

ప్రజాశక్తి-బి.కొత్తకోట

భార్య మందలించిందని భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో జరిగింది. పోలీసులు కథనం మేరకు.. మండలంలోని బడికాయలపల్లి పంచాయతీ, జింకదాట్లపల్లి గ్రామస్తుడు గాలేటి రెడ్డప్ప(39) ఇతను అతిగా మద్యం సేవించి ఇంటికి రావడంతో సోమవారం రాత్రి భార్య రజిని మద్యం సేవించవద్దని భర్తను మందలించగా అప్పుడు గొడవపడ్డారు. భార్య మందలించిందనే ఉద్దేశంతో మంగళవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో అతని ఇంటి వెనుక వైపు చెట్టుకు రెడ్డెప్ప ఉరివేసుకొని మృతి చెందాడన్నారు. ఈ ఘటనపై బి.కొత్తకోట పోలీసులు విచారిస్తున్నారు.